హైదరాబాద్ వార్త



# కోర్టు స్టే ఇచ్చినా.. కొనసాగుతున్న నిర్మాణాలు

-ఎఫ్‌సీఐ లేఔట్ పరిశీలించిన హైడ్రా, సిఎంసీ కమిషనర్లు
-లేఔట్‌లోని రహదారులు, పార్కులను కాపాడేందుకు చర్యలు
-ఉత్తర్వుల ఉల్లంఘనపై చట్టపరమైన చర్యలుంటాయన్న వెల్లడి



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్, సిఎంసి కమిషనర్ సృజన తదితరులు

**హైదరాబాద్, జులై 8,ప్రభాతవార్త:** గచ్చిబౌలి జంక్షన్‌లోని ఎఫ్‌సీఐ(ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ) లేఔట్‌ను హైడ్రా కమిషనర్ రంగనాథ్ , సీఎంసీ కమిషనర్ సృజన బుధవారం సందర్శించారు. హై కోర్టు స్టే ఆర్డర్‌ను పట్టించుకోకుండా ఈ లే ఔట్‌లో నిర్మాణాలు జరుపుతున్నారని అక్కడి ప్లాట్ల యజమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్ర స్థాయిలో ఉన్నతాధికారులు పరిశీలించారు. లే ఔట్‌లోని రహదారులు, పార్కుల హద్దులను చెరిపేసి తవ్వకాలు చేయడం, మట్టి పోయడాన్ని అధికారులు సీరియస్‌గా పరిగణించారు. కోర్టు స్టే ఆర్డర్ ఉన్నా నిర్మాణాలు కొనసాగించడాన్ని తీవ్రంగా పరిగణించారు. లే ఔట్ ప్రకారం రహదారులు, పార్కులు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందుతాయని.. వెంటనే హద్దులు నిర్ధారించి వాటిని కాపాడుతామని అక్కడి ప్లాట్ యజమానులకు హామీ ఇచ్చారు. అలాగే స్టే ఆర్డర్‌ను పట్టించు కోకుండా నిర్మాణాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

**చట్టపరంగా చర్యలు తీసుకుంటాం..**

1980 దశకంలో 20 ఎకరాల విస్తీర్ణంలో 162 ప్లాట్లతో లే ఔట్ వేయగా దాని నామ రూపాలు లేకుండా సంధ్యా కన్వెన్షన్ యజమాని శ్రీధర్ రావు చేస్తున్నారంటూ లే ఔట్‌లోని పలువురు ప్లాట్ యజమానులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన విషయాన్నిహైడ్రా కమిషనర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. లే ఔట్‌లోని రహదారులు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడినట్టు చెప్పారు. తర్వాత ఈ విషయం హైకోర్టుకు వెళ్లడం.. స్టే ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందన్నారు. కోర్టు ఉత్తర్వులు ప్రకారం ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని స్పష్టంగా ఉన్నా.. సంధ్యా శ్రీధర్ రావు ఇక్కడ నిర్మాణాలు కొనసాగించడం. రహదారులు, పార్కులు పట్టించుకోకుండా భూమిని చదును చేయడం, తవ్వకాలు జరపడం.. మట్టిపోయడం జరుగుతోందని ప్లాట్ యజమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇక్కడికి వచ్చామన్నారు. హైడ్రా అధికారులు, సీఎంసీ అధికారులు, జోనల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు కూడా అధికారుల వెంట ఉన్నారు.కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి పలు నిర్మాణాలు చేపట్టడంపట్ల చట్టపరమైన చర్యలుంటాయని హైడ్రా కమిషనర్ హెచ్చరించారు. ఇక్కడి రహదారులను, పార్కులను, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను రక్షిస్తామన్నారు. ఇవి సీఎంసీకి చెందినవిగా హైడ్రా కమిషనర్ పేర్కొన్నారు.

## బల్కంపేట ఎల్లమ్మ బోనాలు, కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలి

**: మంత్రి కొండా సురేఖ**



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి కొండా సురేఖ

**సంజీవరెడ్డి నగర్, జులై 8, ప్రభాతవార్త:** బల్కంపేట శ్రీ ఎల్లమ్మ అమ్మవారి ఆషాఢ బోనాల ఉత్సవాలు, వార్షిక కళ్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించి దేవాలయ ఖ్యాతిని మరింత ఇనుమడింపజేయాలని దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ బుధవారం అధికారులను ఆదేశించారు. బల్కంపేటలో నిర్వహించిన ఉత్సవాల సమన్వయ సమావేశంలో ఆమె పాల్గొని వివిధ శాఖల అధికారులతో ఏర్పాట్లను సమీక్షి ంచారు. అనంతరం అధికారులతో కలిసి ఆషాఢ బోనాల జాతర, ఎల్లమ్మ అమ్మవారి కళ్యా ణోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భం గా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఏడు వందల సంవత్సరాల చరిత్ర కలిగిన బల్కంపేట శ్రీ ఎల్లమ్మ అమ్మవారి ఆలయం తెలంగాణకు ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలిచిందని అన్నారు. అమ్మవారిని దర్శిస్తే అష్టాదశ శక్తిపీఠాలను దర్శించినంత పుణ్యం లభిస్తుందనే విశ్వాసంతో లక్షలాది మంది భక్తులు తరలివస్తారని తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.ఈ నెల 20న సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవంతో వేడుకలు ప్రారంభమవు తాయని, 21న ఉదయం కళ్యాణోత్సవం, 22న సాయంత్రం రథోత్సవం అత్యంత ఘనంగా నిర్వ హించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యే నేపథ్యంలో పోలీ సులు, ట్రాఫిక్, జీహెచ్ఎంసీ, జలమండలి, వి ద్యుత్, వైద్యారోగ్య, అగ్నిమాపక, ఆర్టీసీ, సాంస్కృతిక, సమాచార పౌరసంబంధాల శాఖలు సమన్వయంతో పనిచేసి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ప్రమాదాలు, నీటి నిల్వలు, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. భక్తులకు తాగునీరు, వైద్య సేవలు, మొబైల్ మరుగుదొడ్లు, పార్కింగ్, క్యూ లైన్లు, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని అధికారులకు స్పష్టం చేశారు. తప్పిపోయే చిన్నారుల కోసం ప్రత్యేక సహాయ కేంద్రాలు, అనుమా నితులపై నిఘా, టోల్‌ఫ్రీ సహాయ కేంద్రం ఏర్పాటు చేయాలని కూడా సూచించారు. ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను నిర్దేశిత గడువులో పూర్తి చేసి భక్తులు ప్రశాంతంగా, సురక్షితంగా అమ్మవారిని దర్శించుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి కొండా సురేఖ ఆదేశించారు.ఈ సమావేశంలో దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ము కుంద్ రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక అల, అదనపు పోలీసు కమిషనర్ ఇక్బాల్, సాం స్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజినీర్ నర్సింహారావుతో పాటు దేవాదాయ, జీహెచ్ఎంసీ, పోలీసు, ట్రాఫిక్, విద్యుత్, అగ్నిమాపక, వైద్యారోగ్య, ఆర్టీసీ తదితర శాఖల ఉన్నతాధి కారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్ స్థలానికే కన్నం...కొత్తపేటలో హైడ్రా యాక్షన్

**కబ్జాచెర నుంచి రూ.14 కోట్ల విలువైన ప్రభుత్వ భూమికి విముక్తి**



పోలీసులు బందోబస్తు మధ్య కూల్చివేతలు చేస్తున్న దృశ్యం

**ఎల్.బి.నగర్, జులై 8 ప్రభాతవార్త:** రక్షక భట నిలయానికి కేటాయించిన స్థలానికే రక్షణ కరువు కావడంతో, రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు ఆక్రమణలను ముక్కుమ్మడిగా కూల్చి వేశారు.నగరంలో చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రా అధికారులు ప్రభుత్వ భూమిలో అక్రమంగా వెలిసిన కట్టడాలపై హైడ్రా అధికారులు ఎట్టకేలకు కొరడారులుపించారు.రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని హైడ్రా తన ఖాతాలో వేసుకుంది. పోలీస్‌స్టేషన్ నిర్మాణం కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని కొందరు తప్పుడు పొత్రాలతో స్థలాన్ని కాజేయడానికి వ్యూహరచన చేయగా దాన్ని హైడ్రాధికారులు ఛేదించారు. సుమారు రూ.14 కోట్ల విలువచేసే ప్రభుత్వ భూమిని కాపాడే విషయంలో హైడ్రా, రెవెన్యూ, పోలీసు అధికారులు పెద్దఎత్తున మోహరించారు. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న రూ.14 కోట్ల విలువచేసే 700గజాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హైడ్రా ఏసీపీ ఉమామహేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ నరసింహ, తహసీల్దార్ హేమమాలిని, చైతన్యపురి ఇన్స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం... ఉప్పల్ మండల రెవెన్యూ పరిధిలోని కొత్తపేట నాగోల్ రహదారి పక్కన ఉన్న పోలీస్‌స్టేషన్ కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని సర్వే నంబర్ 135లో ఉన్న సుమారు 700 గజాల విలువైన ప్రభుత్వ భూమిని గత 2007వ సంవత్సరంలో రెవెన్యూ శాఖ చైతన్యపురి పోలీస్‌స్టేషన్ నూతన భవన నిర్మాణం కోసం అధికారికంగా కేటాయించి అందులో పోలీస్‌స్టేషన్ బోర్డును కూడా ఏర్పాటు చేసి స్థలం చుట్టుపక్కల ఫినిషింగ్ ఏర్పాటు చేశారు. రోడ్డుకు పక్కనే నిత్యం రద్దీగా ఉండే ఈ స్థలంపై కన్నేసిన కొందరు స్థానిక కబ్జాదారులు దాన్ని ఆక్రమించి గుడిసెలు, తాత్కాలిక షెడ్లు నిర్మించుకున్నారు. రక్షక భట నిలయ స్థలంలోనే యథేచ్ఛగా వివిధ రకాల వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కారు.ఈ విషయమై అధికారులకు ఫిర్యాదులు రాగా దానిపై విచారణ జరిపిన అధికారులు అది ప్రభుత్వ భూమిగా గుర్తించి బుధవారం రెవెన్యూ, హైడ్రా, పోలీసుల బృందం పెద్దఎత్తున ఆ ప్రాంతానికి చేరుకొని ప్రభుత్వ స్థలంలో నిర్మించిన కట్టడాలను పూర్తిగా కూల్చివేశారు. ప్రభుత్వ స్థలంలో చాలాకాలం క్రితం నిర్మాణాలు జరిపి వ్యాపార సముదాయంగా ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేస్తున్నారు. కాగా బుధవారం అధికారులు ముకుమ్మడిగా ప్రభుత్వ స్థలం వద్దకు చేరుకొని అక్రమంగా ప్రభుత్వ స్థలంలో నిర్మించిన నిర్మాణాలను పూర్తిగా కూల్చివేసి తొలగించారు. చాలాకాలంగా ఆ స్థలంలో తిష్ట వేసిన వారు అధికారులతో వాగ్వాదానికి దిగే ప్రయత్నం చేసినప్పటికీ హైడ్రా అధికారులు, పోలీసులు వారిని వారించి అక్రమ నిర్మాణాలను పూర్తిగా నేలమట్టం చేశారు. సదరు ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని, చుట్టూ ఎలాంటి ఆక్రమణలు జరగకుండా పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఈ కూల్చివేతల కార్యక్రమంలో హైడ్రా ఉన్నతాధికారులతో పాటు చైతన్యపురి పోలీసులు, రెవెన్యూశాఖ అధికారులు భారీ బందొబస్తు మధ్య పాల్గొన్నారు.

## పట్టపగలు చోరీలు... నిందితుడి అరెస్టు



42.3 తులాల బంగారు, 87 తులాల వెండి ఆభరణాలు, 42 వేల నగదు స్వాధీనం

**హయత్ నగర్, జులై 8 ప్రభాతవార్త :** తాళాలు వేసిన ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని హయత్ నగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. హయత్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఏసీపీ కాశిరెడ్డి మంగళవారం రాత్రి వివరాలు వెల్లడించారు.... మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా చింతల్ కు చెందిన శ్రీ రామ్ నరసింహచారి (39) కొంత కాలం కార్పెంటర్ గా పనిచేసి ప్రస్తుతం కారు డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బు సంపాదిం చేందుకు దొంగతనాలను ఎంచుకు న్నాడు. ముఖ్యంగా మధ్యాహ్నం సమయంలో స్కూల్ విద్యార్థులకు తల్లులు భోజనం ఇచ్చేందుకు ఇంటికి తాళాలు వేసి వెళ్లడమే ఆలస్యం ఆ ఇళ్ల తాళాలు పగులగొట్టి సొత్తును అపహరించడం అలవాటుగా మార్చుకున్నాడు. ఈ క్రమంలో రెండున్నర దశబ్దాలుగా దాదాపు 70 వరకు దొంగతనాలకు పాల్పడ్డాడు. జైలుకు సైతం వెళ్లి వచ్చాడు. ఈ ఏడాది ఏప్రిల్ 15,16 తేదీల్లో మునుగనూరు లో తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలను అపహరించుకు పోయాడు. సదరు సొత్తుతో ఆన్లైన్ బెట్టింగ్ నిర్వహించేవాడు. అపహరించిన బంగారు ఆభరణాలను ఆన్లైన్‌లో విక్రాయిస్తున్నాడు. ఈనెల 7న మునుగనూరు లో అనుమానస్పదంగా పోలీసులకు చిక్కాడు. పోలీసులు తమదైనా శైలిలో విచారించగా నేరలను అంగీకరించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుడి నుండి 42.3 తులాల బంగారు, 87 తులాల వెండి ఆభరణాలు, 42 వేల నగదును స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్ కు తరలించారు. సమావేశంలో సీఐ శంకరయ్య, డీఐ సంతోష్, సిబ్బంది ఉన్నారు.

## మళ్లీ అదే దోపిడి!



- జరిమానాలు వేస్తున్నా కానరాని మార్పు
- సంస్థ లోగోలు ముద్రించి విక్రయిస్తున్న మాల్స్
- ఒక్కోబ్యాగ్‌కు రూ.5నుంచి 20 వరకు వసూళ్లు
- ప్రశ్నించినవారిపై గొడవకు దిగుతున్న నిర్వాహకులు
- ఫ్రీగా ఇవ్వకపోతే ఫిర్యాదు చేయాలంటున్న అధికారులు

**హైదరాబాద్, జులై 8,ప్రభాతవార్త:** షాపింగ్ మాల్స్,సూపర్‌మార్కెట్‌లకు షాపింగ్ చేయడానికి వెళ్లినప్పుడు తీసుకోవడం పూర్తయ్యాక..బిల్లు చెల్లించే సమయంలో క్యాష్ కౌంటర్‌లో ఉండే వ్యక్తి నుంచి మనకోమాట వినబడతుంది."క్యారీబ్యాగ్ కావాలా సర్" అని.. ఆసమయంలో మనం స్పందించి కావాలి అనగానే మనం తీసుకున్న సరుకులధరలకు మరోరేటు కలపబడుతుంది అదే క్యారీబ్యాగ్ ధర. ఆసమయంలో వేలరూపాలు పెట్టి సరుకులు కొన్నాం..క్యారీబ్యాగ్ గురించి మాట్లాడితే ఏమనుకుంటారోనని మనసులో అనుకుని వారు అడిగినంత చెల్లించి బిల్లు తీసుకుని వెళ్ళిపోతుంటాం. ఇది మాల్స్,సూపర్ మార్కెట్‌లలో నిత్యం జరిగే తంతు.కానీ ఇటీవల పలువురు వినియోగదారులు తమసంస్థల లోగోలు ముద్రించి ఉండటంతో ప్రశ్నించడంతోపాటు సంస్థలపై కేసులు వేస్తున్నారు. ఇటీవల ఉప్పల్‌కు చెందిన శ్రీకాంత్ అనేవ్యక్తికి ఊడా ఇలాంటి అనుభవమే ఎదురైంది. బేగంపేట్‌లోని షాపింగ్ చేసిన అతనికి బిల్లు కట్టే సమయంలో క్యారీబ్యాగ్‌తో కలిపి రూ.5ఎక్కువ బిల్లు వేసారు. మీషాప్‌లో కొన్న వస్తువులకు మీరే క్యారీ బ్యాగ్ ఇవ్వాలి కదా ని అతను అడిగితే అందుకు వారి దగ్గరనుంచి ఎలాంటి సమాధానం రాలేదు. ఈవిషయంపై రాష్ట్ర వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశాడు. వారిద్దరి వాదనలు విన్న రాష్ట్ర వినియోగదారుల సమాచార వివాద పరిష్కార కేంద్రం... ఆషాప్‌కు రూ.7వేల జరిమానా విధించింది. షాప్‌లోగోలు ము ంద్రించి ఉండే క్యారీ బ్యాగ్‌ను ఉచితంగా ఇవ్వాలని,లోగోలు లేని సంచినే ఖరీదు కట్టి అమ్మాలని తెలిపింది. అతని ఫిర్యాదుతో ఏషాప్ అయినా సరే తమ లోగో ఉన్నబ్యాగ్‌ను ఉచితంగా ఇవ్వాలని ఆదేశాలిచ్చింది. లేదంటే జరిమానా విధిస్తామని హెచ్చరించింది. ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే టోల్‌ఫ్రీనెం 180042 500333కి ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. అయితే గతకొద్దిరోజులుగా పలు షాపింగ్ మాల్స్ మళ్ళీ దోపిడీని మొదలుపెట్టాయి. కొన్నిరోజుల పాటు ఎలాంటి లోగోలు ముద్రించకుండా అమ్మకాలు సాగించిన వ్యాపారులు ఇటీవల మళ్ళీ తమ సంస్థలోగోలు ముద్రించి అమ్ముతున్నారు. ప్రశ్నించినవారిపై క్యారీబ్యాగ్ కావాలా వద్దా అంటూ గొడవకు దిగుతున్నారు. దీంతో చేసేదేమీ లేక డబ్బులిచ్చి క్యారీబ్యాగ్ కొనుగోలు చేస్తున్నారు.

**ఫిర్యాదు ఇలా..**

వస్తువు కొనగోలు చేసిన నాటి నుండి రెండేళ్లలోపు వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం. .కింద కేసు నమోదు చేసుకోవచ్చు. ఫిర్యాదు స్వీకరించిన ఫోరం 21రోజుల్లోగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యాపార సంస్థకు నోటీసులు జారీచేస్తారు. 21రోజుల్లోపు ఆఫిర్యాదుకు విచారణకు అర్హత ఉందా లేదా నిర్ణయిస్తారు. ఫిర్యాదు చేసిన నాటి నుండి 90రోజుల్లోగా వినియోగదారుడికి సత్వర పరిష్కారం సెక్షన్ 27కింద నమోదు చేసి సదరు వినియోగదారుల ఫోరం కమీషన్‌కు చూపించాల్సి ఉంటుంది.

**ఈఆధారాలు కచ్చితంగా ఉండాలి..**

ఏదుకాణం,సంస్థలో కొనుగోలు చేసిన బిల్లు,బిల్లులో కొనుగోలు చేసిన వస్తువు లాట్ నెంబర్, ఎంఆర్‌పీ,ఎక్స్‌పైర్ డేట్ ఇలా అన్ని వివరాలు ఉండాలి.బిల్లుపై సంబంధింత వ్యాపారి సంతకం సీలు ఉండేలా చూసుకోవాలి. కొనుగోలు చేసిన వస్తువుల నాణ్యత పరిమాణంలో మోసం జరిగిందని భావించినప్పుడు అన్ని ఆధారాలను జీరాక్స్ కాపీతో పాటు వినతిపత్రం ద్వారా వినియోగదారులఫోరంలో కేసు నమోదు చేసి నా ్యయం పొందవచ్చు.

## యూట్యూబ్‌లో చూసి..వైన్ తయారీ

-ముఠా గుట్టు రట్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు
-377 లీటర్ల వైన్‌తోపాటు సామాగ్రి స్వాధీనం



ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న వైన్, చిత్రంలో నిందితుడు ఆంటోనీ ఫీటర్

**హైదరాబాద్,జులై 8,ప్రభాతవార్త:** యూట్యూబ్‌లో చూసి వైన్ తయారీ నేర్చుకున్నాడు. వృద్ధప్యంలో స్వయం ఉపాధి మార్గం అన్వేషణలో ఆంటోనీ ఫీటర్ అనే వ్యక్తి ఎక్సైజ్ శాఖ నిబంధనలకు వ్యతిరేకంగా ఏడాదిగా వైన్ తయారు చేస్తున్నాడు. సమాచారం అందుకున్న మల్కాజ్‌గిరి డీటీఎఫ్ సీఐ భరత్ కుమార్, ఎస్సై శ్రీనివాసరెడ్డి సిబ్బంది కలిసి దాడులు నిర్వహించి వైన్ తయారీ గుట్టు రట్టు చేశారు.వివరాల్లోకి వెళితే.. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఏడు రకాల వైన్ తయారీ చేస్తు 750 ఎంఎల్ బాటిల్‌ను రూ.300 అమ్మకాలు జరుపుతూ ఆంటోనీ ఫీటర్ లాభాలను అర్జిస్తున్నట్లు డీటీఎఫ్ సీఐ తెలిపారు. గ్రేప్స్, ఫైనాఫిల్, జామా, మోసంబి, సపోట, బనాన, తమలాపాకు పేర్లతో వైన్‌ను తయా రు చేస్తున్నాడు. పండ్లను నాచరల్‌గా 15 రోజుల పాటు ఫామింగ్ చేసి అందుల్లో పంచదార, గొదుమలు కలిపి వడకట్టి వైన్‌గా తయారు చేసి అమ్మకాలు జరుపుతున్నాడు. పండ్లను 15 రోజుల పాటు ఫామింగ్ చేస్తే అందులో పండ్ల రసంతో పాటు అల్కహాల్ కూడ వస్తుంది. ఈపద్దతిలో తయారు చేసిన వైన్‌ను నేరేడ్‌మెట్, సికింద్రాబాద్ ఎన్‌హెచఓ కాప్రా ప్రాంతాల్లో అమ్మకాలు జరుపుతున్నట్లు విచారణలో వెల్లడయ్యింది. ఈ దాడిలో 377.7 లీటర్ల వైన్‌ను, 502 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న వైన్ విలువ రూ. 1.50 లక్షలుగా ఉంటుందని అంచనా వేశారు. ఎక్సైజ్‌శాఖ ఆదాయనికి గండికొడుతున్న వైన్ ముఠా గుట్టురట్టు చేసిన డీటీఎఫ్ టీమ్‌ను మాల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్ ప్రణవి, ఈఎస్ బి. హన్మంతరావు అభినందించారు. పట్టుకున్న వైన్‌ను, నిందితుడిని కాప్రా ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.

## వైఎస్సార్ జయంతి వేడుకల్లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



వైఎస్సార్ విగ్రహం వద్ద మల్లు భట్టి విక్రమార్క, కేవీపీ రాంచందర్‌రావు, దానం నాగేందర్ తదితరులు.

**జూబ్లీహిల్స్, జులై 8, ప్రభాతవార్తః** వైఎస్సార్ జయంతి వేడుకలను బుధవారం బంజారాహిల్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కేవీపీ రాంచందర్‌రావు, కాంగ్రెస్ నేతలు రాములు చవాన్, టిల్లు యాదవ్ తదితరులు బంజారా హిల్స్‌లోని సిటీ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్ తెలుగు రాష్ట్రాల ప్రజల గుండెల్లో నిత్యం ఉంటారని మల్లు భట్టువిక్రమార్క అన్నారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేటికి అమల వుతున్నాయంటే ప్రజల ఆదరణ ఎంతగా ఉందో అర్థమవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు పేదల పక్షానే నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వనం సంగీత యాదవ్, వనం శ్రీనివాస్‌యాదవ్, నారికేళ నరేష్ పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా జరగాలి

**-జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్**



చంచల్‌గూడలో బిఎల్‌వోలతో కలిసి మాట్లాడుతున్న ఆర్.వి.కర్ణన్ తదితరులు

**హైదరాబాద్,జులై 8, ప్రభాతవార్త:** బిఎల్‌వోలు ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టి ఎన్నికల సంఘం మార్గదర్శకాలు తప్పక పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులకు సూచించారు. ఈమేరకు బుధవారం మలక్‌పేట నియోజకవర్గ పరిధి లోని చంచల్‌గూడ, చాప్నీ ప్రాంతాల్లోని పోలింగ్ స్టేషన్లు 274 ,283 వద్ద జరు గుతున్న కార్యకలాపాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మా ట్లాడి, ప్రక్రియను పరిశీలించడంతో పాటు వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చా రు.అలాగే ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ ప్రక్రియ క్షేత్రస్థాయిలో అమలు తీరు ను సమీక్షించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, ఓటర్లకు సమర్థవంతంగా సేవలు అందిస్తూనే కేటాయించిన పనులన్నింటినీ నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలని ఎన్నికల నమోదు అధికారి, సహాయ ఎన్నికల నమోదు అధికారులు, పర్యవేక్షక, బూత్ స్థాయి అధికారులు, ఏజెంట్లను ఆదేశించారు.

## విద్యుత్ అంతరాయాల నివారణకు 'సమగ్ర కార్యాచరణ'

**-క్యూర్ పరిధిలో యుద్ధ ప్రాతిపదికన చెట్ల కొమ్మల తొలగింపు**

**-టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండీ జితేష్ పాటిల్**

**హైదరాబాద్,జులై 8,ప్రభాతవార్త:** వర్షాకాలంలో విద్యుత్ సరఫరా అంతరాయాలు లేకుండా సమగ్రమైన కార్యాచరణ సిద్ధం చేసినట్లు టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండీ జితేష్ విపాటిల్ తెలిపారు. ఈమేరకు బుధవారం క్యూర్ రీజియన్ పరిధిలోని ముఖ్య అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగాచీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు, డివిజనల్ ఇంజినీర్లకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పనులు 24 గంటల్లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక మున్సిపల్ జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లతో సమన్వయం చేసుకుని తొలగించిన కొమ్మలను నిల్వ చేసేందుకు తగిన డంపింగ్ ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. రహదారులపై చెట్ల కొమ్మలు పేరుకుపోకుండా వెంటనే డంపింగ్ యార్డులకు తరలించి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. అలాగే క్యూర్ రీజియన్ పరిధిలో ట్రీ ట్రిమ్మింగ్, లైన్ క్లియరెన్స్ కార్యక్రమాలను రాబోయే పది రోజుల్లో పూర్తిస్థాయిలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అండర్ గ్రౌండ్ (యూజీ) కేబుల్ పనుల అనంతరం చేపట్టాల్సిన ట్రెంచ్ పునరుద్ధరణ పనులను వేగవంతం చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. తవ్వకాల అనంతరం రోడ్ల పునరుద్ధరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల (డీటీఆర్) నంబరింగ్, కన్స్యూమర్ మ్యాపింగ్ క్యూర్ రీజియన్ పరిధిలో ఇప్పటికే 90 శాతం డీటీఆర్ మ్యాపింగ్ పూర్తయిందని అధికారులు సీఎండీకి వివరించగా, మిగిలిన పనులను కూడా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. డీటీఆర్‌ల పరిశుభ్రత, నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి డీటీఆర్ వద్ద పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే డీటీఆర్‌ల ఎర్తింగ్ వ్యవస్థలను తనిఖీ చేసి భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడాలని ఆదేశించారు.ఈ నెల 10వ తేదీ తరువాత నిర్వహించే "వాక్ అలోంగ్ ది లైన్" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ విద్యుత్ లైన్లు, స్తంభాలు, డీటీఆర్‌లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి లోపాలను ముందుగానే గుర్తించి పరిష్కరించాలని పేర్కొన్నారు. వర్షాకాలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించడం, భద్రతా ప్రమాణాలను మరింత మెరుగుపరచడం, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

### ఎస్ఆర్ నాయక్ నగర్‌లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**జీడిమెట్ల, జులై 8, ప్రభాతవార్త**
సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని ఎస్ఆర్ నాయక్ నగర్ కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ టీఎస్ఎస్‌పీడీసీఎల్ కుత్బుల్లాపూర్ డిప్యూటీ ఇంజనీర్ శ్రీనివాసులను సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, ఎస్ఆర్ నాయక్ నగర్ మాజీ అధ్యక్షుడు ఆలూరు వెంకట శేష చారి కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో కాలనీలో తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. కొద్దిపాటి గాలి లేదా వర్షం వచ్చినా విద్యుత్ సరఫరా నిలిచిపోతుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గతంలో కూడా ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ శాశ్వత పరిష్కారం లభించలేదని తెలిపారు. కాలనీలోని పాత విద్యుత్ లైన్ల స్థానంలో ఏబీ కేబుల్ ఏర్పాటు చేయడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద క్రమం తప్పకుండా నిర్వహణ పనులు చేపట్టాలని కోరారు. కాలనీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో కామేశ్వర శర్మ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

### ట్రాఫిక్ సిగ్నళ్లను తిరిగి ప్రారంభించాలని ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యే వివేకానంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న రవీందర్ ముదిరాజ్

**జీడిమెట్ల, జులై 8, ప్రభాతవార్త**
సూరారం చౌరస్తాలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ పనుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక డివైడర్లను తొలగించి, ట్రాఫిక్ సిగ్నళ్లను తిరిగి ప్రారంభించాలని కోరుతూ పర్యావరణ ప్రేమికుడు, సామాజికవేత్త కోల రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేపీ వివేకానందకు బుధవారం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో సూరారం ఎక్స్‌రోడ్‌లో డ్రైనేజీ పనులు పూర్తయినప్పటికీ ఇప్పటికీ డివైడర్లు తొలగించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గ్రామం వైపు నుంచి వచ్చే వాహనాలను ఎడమవైపు మళ్లించేలా, నారాయణ ఆస్పత్రి సమీపంలో యూటర్న్ సౌకర్యం కల్పించేలా ట్రాఫిక్ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాలని కోరారు. దీంతో కార్మికులు, విద్యార్థులు, స్థానిక ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని తెలిపారు. వినతిపై స్పందించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద వెంటనే ట్రాఫిక్ పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, కోల శ్రీకాంత్, శ్రీనివాస్ రెడ్డి కె, విక్రం రెడ్డి, కాలనీ అధ్యక్షుడు సురేష్, ప్రసాద్, కేశవ్, గోపాల్ రెడ్డి, అనీఫ్‌తో పాటు కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

### రూ.45 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శ్రీకారం


కొబ్బరికాయ కొట్టి కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న హన్మంత్‌రెడ్డి

**నిజాంపేట్, జులై 8, ప్రభాతవార్త**
సాయి నగర్ బాచుపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.45 లక్షలు మంజూరు చేసింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోలన్ హన్మంత్ రెడ్డి చేసిన కృషితో ఈ నిధులు మంజూరయ్యాయి.ఈ సందర్భంగా డబుల్ బెడ్‌రూమ్ కాలనీ కమిటీ స్థలంలో కోలన్ హన్మంత్ రెడ్డి బుధవారం కొబ్బరికాయ కొట్టి కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ఘనంగా ప్రారంభించారు. బాల బ్రహ్మచారి ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న ఈ కమ్యూనిటీ హాల్ కాలనీ ప్రజలకు సామాజిక, సాంస్కృతిక, సమావేశ కార్యక్రమాలకు ఉపయోగపడేలా నిర్మించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా కోలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూమ్ కాలనీల్లో నివసించే ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తయితే కాలనీవాసులకు వివిధ సామాజిక, విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు శాశ్వత వేదిక అందుబాటులోకి వస్తుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్‌రూమ్ కాలనీ కమిటీ సభ్యులు, కాలనీ నివాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### నల్ల పోచమ్మ ఆలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే తలసాని


అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తలసాని

**సంజీవరెడ్డి నగర్, జులై 8, ప్రభాతవార్త:**
సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ఏరియాలో పునర్నిర్మించిన శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి కృషి చేసిన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యం ఇస్తూ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొలన్ బాల్‌రెడ్డి, అధ్యక్షుడు కొలన్ భూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాదగిరి గుప్త, ఉపాధ్యక్షులు శివశంకర్ గుప్త, శ్రీనివాస్, చంద్రశేఖర్ గుప్త, ఆర్‌సీ పటేల్, నాయకులు సురేష్ గౌడ్, రమేష్ గౌడ్, రాజేష్ ముదిరాజ్, శేఖర్, అర్జున్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


హైదర్షాకోట్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 250.మందికి ఉచితంగా ప్లేట్లు పంపిణీ చేస్తున్న కాంటెస్టెడ్ కార్పొరేటర్ కొరివి గణేష్.


పర్వత్‌నగర్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిలో పాల్గొన్న టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వేముల సత్యం, గాయిత్రినగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు దేవరింటి మస్తాన్.


బొమ్ము వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలు ప్రగతి నగర్‌లోని వైఎస్సార్ చౌరస్తా వద్ద ఘనంగా నిర్వహించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


గాంధీనగర్ లో స్థానిక డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బింగి సాయికీర్త్ ఆధ్వర్యంలో జరిగిన మాజీ సీఎం డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం. అరవింద్ కుమార్ యాదవ్


దివంగతనేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బొల్లంపల్లి విజయ్‌భాస్కర్‌రెడి ,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు


షాపూర్ నగర్ చౌరస్తాలో వై.ఎస్. రాజశేఖర్ రెడ్డికి నివాళులు అర్పిస్తున్న శ్రీశైలంగౌడ్

**జనహృదయ నేత వైఎస్సార్**

## నిజాంపేటలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి : బిజెపి

**నిజాంపేట్, జులై 8, ప్రభాతవార్త**
నిజాంపేట సర్కిల్ పరిధిలోని బండారి లేఅవుట్‌తో పాటు పలు కాలనీల్లో నెలకొన్న తీవ్రమైన తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ నాయకులు హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) నిజాంపేట డివిజన్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు బుధవారం నిజాంపేట-బండారి లేఅవుట్ భాజపా అధ్యక్షుడు బిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిక్షపతి యాదవ్ మాట్లాడుతూ స్థానిక అపార్ట్‌మెంట్లు, కాలనీలు నీటి కనెక్షన్లు, అభివృద్ధి ఛార్జీల రూపంలో ఒక్కో అపార్ట్‌మెంట్‌కు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు చెల్లించినప్పటికీ, పైప్‌లైన్ ద్వారా తగినంత తాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సరిపడా నీటి సరఫరా లేక ప్రజలు ఆన్‌లైన్ ట్యాంకర్ బుకింగ్‌లు, ప్రైవేట్ ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోందని, దీనివల్ల కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందన్నారు.ఆన్‌లైన్ ట్యాంకర్ బుకింగ్ విధానంలో పారదర్శకతపై ప్రజల్లో అనేక సందేహాలు ఉన్నాయని, కొందరు అధికారులు ప్రైవేట్ ట్యాంకర్లకు ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ అంశంపై విజిలెన్స్ విభాగంతో సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నిజాంపేట సర్కిల్ పరిధిలో దాదాపు నాలుగు లక్షల జనాభా నివసిస్తున్నప్పటికీ, జనాభాకు అనుగుణంగా నీటి సరఫరా జరగడం లేదని ఈ కార్యక్రమంలో భాజపా ప్రధాన కార్యదర్శి సచిన్, శ్రీనివాస్ గుప్తా, కార్యదర్శి పాండు, ఖజానా దారు త్రినాథ్, బీజేవైఎం అధ్యక్షుడు రాజేష్ ముదిరాజ్, మాజీ సైనిక విభాగం కన్వీనర్ ఈశ్వరరావు, నాయకులు అమరేందర్ బాబు, కాలనీవాసులు వెంకట్రావు, ప్రసాద్, రవి పాల్గొన్నారు.


అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న భాజపా నేతలు

## జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి : సూపరిండెంటెంట్ రాకేష్‌సహాయ్

**అఫ్జల్‌గంజ్,జులై 8ప్రభాతవార్త:** ప్రతి ఒకరికి చర్మం కేవలం అందం కోసమే కాదని,ఆరోగ్యకరమైనచర్మం శరీరానికి రక్షణ కవచంగా పనిస్తుందని ఉస్మానియా జనరల్ ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ రాకేష్‌సహాయ్ పేర్కొన్నారు.బుధవారం ప్రపంచ చర్మ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉస్మానియా ఆసుపత్రి ఎ.డి.వి.ఎల్ డిపార్ట్‌మెంట్,డివిఎల్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచచర్మ ఆరోగ్యదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ముందుగా ఉస్మానియా ఆసుపత్రి ఓపి విభాగం నుంచి విభాగం అధిపతి ప్రొఫెసర్,డాక్టర్ భూమేష్‌కుమార్ ఆధ్వర్యంలో చర్మ విభాగం వైద్యులు,నర్సింగ్ విద్యార్థులతో కలిసి చర్మ సౌందర్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమావేశం హాల్‌లో ఏర్పాటు చేసిన ఆసుపత్రిలో సూపరిండెంటెంట్ డాక్టర్ రాకేష్‌సహాయ్ మాట్లాడుతూ చర్మ వైద్యులు చర్మవ్యాధిరోగులకు చేస్తున్న సేవలు,అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు.చర్మ విభాగం అధిపతి ప్రొఫెసర్ డాక్టర్ భూమేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతియేటా మాదిరగానే ఈ యేడు కూడాచర్మ విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగిందన్నారు.చర్మం ఆరోగ్యకరమైనచర్మానికి ఎంతో దోహదపడుతుందన్నారు.చర్మ వ్యాధికి గురైన రోగులు వైద్యులను సంప్రదించకుండా ఇష్టానుసారంగా మార్కెట్ వచ్చే క్రీములను వాడటం మూలంగా చర్మ సౌందర్యాన్ని కోల్పోయే ప్రమాదముందన్నారు.సమాజ శ్రేయస్సు కొరకు పత్రికా రంగం ఎంతో మేలు చేస్తుందన్నారు.సమాజాన్ని పరిరక్షణ కోసం కృషి చేస్తుందన్నారు.ఉస్మానియా ఆసుపత్రి చర్మ విభాగం వైద్యులు మధుబాబు,సుధీర్,అరుణ చర్మవ్యాధిపై అనేక విషయాలకు సందేహాలను నివృత్తి చేశారు.వారు మాట్లాడుతూ రంగు తగ్గిన, తెల్లని మచ్చలు,స్పర్శ లేని భాగాలు రోగానికి సంకేతమన్నారు. తెల్లగా,వెంట్రుకలు మాదిరిగా పోలిసిన చర్మ మచ్చలు సోరియాసిస్ లక్షణంగా ఉండవచ్చునన్నారు. చర్మం,జుట్టు, నఖాలు,జననాంగ సమస్యల కోసం చర్మ వైద్యనిపుణులను సంప్రదించాలన్నారు.ఆరోగ్యకరమైన చర్మం కోసం ఆరోగ్యకరమైన ఫౌష్టికా ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. నర్సింగ్ విద్యార్థులు చర్మ ఆరోగ్య పరిరక్షణపై చేసిన ప్రదర్శన పలువురిని ఎంతో ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పస్ట్ ఆర్.ఎం.ఓ డాక్టర్ శ్రీమన్నారయణ,కవిత,న్యాట్‌కో ,నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ రాకేష్‌సహాయ్,చర్మవిభాగం అధిపతి డాక్టర్ భూమేష్‌కుమార్,వైద్యులు

## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో సమర్ధవంతమైన పాలన: శివ నాగేశ్వరరావు

**ముషీరాబాద్, జులై 8, ప్రభాతవార్త:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే సమర్ధవంతమైన పాలన కొనసాగుతుందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి పేరం శివ నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన జులై 15వ తేదీ కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలే సమక్షంలో రాష్ట్ర అభివృద్ధి-కేంద్రనిధులు అనే అంశంపై జరగబోయే సమీక్షా సమావేశంకు మంత్రిని ఆహ్వానించారు. అనంతరం శివ నాగేశ్వరరావు మాట్లాడుతూ 15వ తేదీ జరగబోయే సమీక్షా సమావేశంలో తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాల విద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షేమం, రాష్ట్ర మౌళిక సదుపాయాల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం నుంచి రాజ్యాంగ బద్ధంగా రావల్సిన నిధులను సాధించటంపై సమగ్రంగా చర్చిస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మహిళా సంక్షేమ హాస్టళ్ల ఆధునీకరణ, మౌళిక సదుపాయాల విస్తరణ, డిజిటల్ క్లాస్‌రూమ్‌ల ఏర్పాటు, విద్యార్థులకు నాణ్యమైన వసతి, విద్యా సౌకర్యాల కల్పన కోసం కేంద్ర సామాజిక న్యాయశాఖ నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని సమావేశంలో విజ్ఞప్తి చేయనున్నట్లు వివరించారు. ఈ సమీక్షా సమావేశానికి కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత శాఖ మంనరతి రామ్‌దాస్ అథవాలే, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌పీఐ పీఆర్ఓ టి.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.


మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కలిసిన ఆర్‌పీఐ జాతీయ కార్యదర్శి

## ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేంతవరకు పోరాటం కొనసాగిస్తాం

**సైఫాబాద్, జులై 8 ప్రభాతవార్త:** గత కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం ఆర్టీసీని పూర్తిస్థాయిలో ప్రభుత్వంలో విలీనం చేసేంతవరకు కార్మికుల పక్షాన పోరాటం చేస్తామని రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హామీ ఇచ్చారు. ఆర్టీసీ బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఆర్టీసీ కార్మిక ఉద్యమ నాయకుడు శంకర్‌గౌడ్ సంస్మరణలో సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. శంకర్‌గౌడ్ వేలాది మంది ఆర్టీసీ కార్మికుల కోసం తన ప్రాణాలను బలిదానం చేశారని, ఆసమయంలో కార్మిక యూనియన్‌ల నాయకులు ఏలాంటి ఆందోళనలు చేపట్టకుండా ఆయన మృతదేహన్ని పట్టించుకోకుండా ప్రభుత్వంతో చర్చలకు వెళ్ళడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నాడే ఆందోళనలు చేసి ఉంటే ప్రభుత్వం దిగివచ్చి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఉండేదని ఆయన స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రాణాలను త్యాగం చేసిన శంకర్‌గౌడ్ చరిత్రలో నిలిచిపోతారని ఆయన కొనియాడారు.బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తరువాతే కార్మిక సంఘానికి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు శంకర్‌గౌడ్ కుటుంబానికి ఒక లక్షా 116 రూపాయలు ఆర్థిక సహాయం అందించగా, తలసాని శ్రీనివాస్‌యాదవ్ తాను ఒక లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తా నని ప్రకటించారు. ఈ సమావేశంలో ఆర్టీసీ నాయకులు పవన్‌గౌడ్, తిరపతయ్య,నిరంజన్ పాల్గొన్నారు.


శంకర్‌గౌడ్ భార్యకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్

### పాతబస్తీలో నకిలీ ధృవీకరణ పత్రాల ముఠా గుట్టురట్టు

**చార్మినార్,జులై 8 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ ఎత్తెబార్ చౌక్ ప్రాంతంలో నకిలీ ధృవీకరణ పత్రాలు కలిగియున్న ఓ నింధితుడిని మీర్ చౌక్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.నింధితుడు వద్ద నుంచి 15 నకిలీ సర్టిఫికెట్లను స్వాధీనం చేసుకున్నారు.మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కొండలరావు కథనం ప్రకారం ...పాతబస్తీ చాంద్రాయణగుట్ట నసీబ్‌నగర్‌కు చెందిన అబ్దుల్ రాషీద్ ఖాన్ (38) కొద్ది కాలంలోనే ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో నకిలీ సర్టిఫికెట్లు విక్రయించాలని భావించాడు.ఈ నేపథ్యంలోనే ఈ నెల ఏడవ రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఎత్తెబార్ చౌక్ ప్రాంతానికి వస్తున్నాడని సమాచారం పోలీసులకు తెలిసింది.రాషీద్ ఖాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి దేశంలోని పలు విద్యా సంస్థలకు చెందిన 15 నకిలీ ధృవీకరణ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.రాషీద్ ఖాన్‌పై బిఎన్ఎస్ 388,339 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం పోలీసులు గాలిస్తున్నారు.ఈ కేసును సబ్ ఇన్‌స్పెక్టర్ సి.అనిత దర్యాప్తు చేస్తున్నారు.

### భార్య ఎదుటే భర్త, ప్రియురాలు ఆత్మహత్యాయత్నం

**సికింద్రాబాద్, జులై 8 ప్రభాతవార్త:** రైలు ప్రయాణంలో భార్య ఎదుటే భర్త అతడి ప్రియురాలు ఆత్మహ త్యాయత్నం చేసిన ఘటన చర్ల పల్లి రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. కదులుతున్న రైలులోనే ప్రియురాలితో కలిసి పురుగుల మందు తాగి ఆత్మాహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని శ్రీకాకుళం జిల్లా ఛత్రా గ్రామానికి చెందిన ఆటో నడుపుతూ జీవనం సాగించే శిరీష్ కుమార్ (34), సులోచన దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు. శిరీష్ కుమార్‌కు ఛత్రా గ్రామంలోనే ఓ వివాహిత నీలాదేవి(34)తో పరిచయం ఏర్పడింది. ఆమే అనారోగ్యంతో బాధపడుతుండటంతో పిల్లలతో కలిసి హైదరాబాద్‌లోని మూసాపేట్‌లో నివాసం ఉంటోంది. తరచూ ఈమెను కలిసేందుకు శిరీ శకుమార్ శ్రీకాకుళం నుంచి మూసాపేటకు వచ్చి పోతుండేవాడు. ఈ క్రమంలో నెలరోజుల కిందట వీరిద్దరూ అదృశ్యమయ్యారు. కోయంబత్తురులో మకాం పెట్టారు. విషయం తెలుసుకున్న సులోచన బంధువులతో కలిసి అక్కడకు వెళ్లారు. ఇద్దరినీ గుర్తించి వారిని తీసుకుని సోమవారం మధ్యాహ్నం శబరి ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్‌కు బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న రైలు చర్లపల్లి చేరువలోకి రాగానే శిరీష్ కుమార్, నీలాదేవిలు గడ్డిమం దును తాగారు. వీరిద్దరిని సులోచన తోటి ప్రయాణి కులు, ఆర్‌పీఎఫ్ సహకారంతో గాంధీ ఆస్పత్రికి తరలిం చారు. వీరి పరిస్థితి విషమంగానే ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు.

### పోలీసులకు ఫౌష్టికాహారం అవసరం



అబిడ్స్ పోలీసు సిబ్బందికి ఆరోగ్యంపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న దృశ్యం

**గన్‌ఫౌండ్రి, జులై 8ప్రభాతవార్త:** శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు 24గంటల పాటు,నిరంతరంవిధులు నిర్వహిస్తుంటారు.ఈ నేపథ్యంలో అబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు పోషకాహారం-ఆరోగ్యంపైప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు.ఆహార నిపుణులు హేమ మాట్లాడుతూ ప్రతి రోజు విధి నిర్వహణలో ఉండే సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు పోషకాహారం తీసుకోవడం, మంచి అలవాట్లను అలవర్చుకోవడం,ఎంతో కీలకమన్నారు.అబిడ్స్ అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీసు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూపోలీసు సిబ్బంది ప్రతి రోజు వ్యాయంతో పాటు ప్రత్యేక దృషి సారించాలన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యంగా తమ విధులను మరింత, ఉత్సాహంతో,సమర్ధవంతంగా నిర్వహించగలుతామ న్నారు. ఈకార్యక్రమంలో అబిడ్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పరుశురాం, ఎస్ఐలు గౌరేందర్‌గౌడ్,శ్రీరాములు,పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా అర్బన్ బిజెపి అధికార ప్రతినిధిగా గోపాల్ రావు

**కెపిహెచ్‌బి కాలనీ, జులై 8, ప్రభాతవార్త**
రంగారెడ్డి జిల్లా అర్బన్ బిజెపి అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి శేరిలింగంపల్లి నియోజకవర్గంకు చెందిన ఏ గోపాల్ రావు రంగారెడ్డి జిల్లా అర్బన్ బిజెపి అధికార ప్రతినిధిగా నియమించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ బిజెపి పార్టీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు పదవులు దక్కుతాయని పేర్కొన్నారు. అలాగే అందరినీ కలుపుకొని బిజెపి పార్టీని బలోపేతం చేసి రానున్న గ్రేటర్ ఎన్నికలలో బిజెపి పార్టీ విజయం కోసం కృషి చేయాలని సూచించారు. అనంతరం గోపాల్ రావు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పార్టీ తనకు పదవిని కట్టబెట్టినందుకు బిజెపి బలోపేతానికి శాయశక్తుల కృషి చేస్తానని పేర్కొన్నారు.

### జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు


డిసి పుష్పలతను కలిసి వివరిస్తున్న ఎం.అరవింద్ కుమార్ యాదవ్, చిత్రంలో బింగి సాయికీర్త్ తదితరులు

**చిక్కడపల్లి జులై 8 ( ప్రభాతవార్త ) :**
గాంధీనగర్ డివిజన్ పరిధిలోని భీమా మైదాన్ ప్రాంతంలో నివసిస్తున్న పేద కుటుంబాలను ప్రత్యామ్నాయ వసతి కల్పించాలని గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బింగి సాయికీర్త్ నేతృత్వంలో ప్రతినిధి బృందం బుధవారం జిహెచ్ఎంసీ డిప్యూటీ కమీషనర్ పుష్పలతను కలిశారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్ కుమార్ యాదవ్ డిప్యూటీ కమీషనర్ తో కూలంకషంగా చర్చించారు. భీమా మైదాన్‌లోని ఇళ్ల నిర్మాణాలు బలంగా ఉన్నప్పటికీ, ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా ఖాళీ చేయాలని ఆదేశించడం పేదల పట్ల అన్యాయమని పేర్కొన్నారు. ఇక్కడ నివసిస్తున్న వారికి ప్రత్యామ్నాయం చూపిన తరువాతనే ఖాళీ చేయాలనీ సూచించారు.

### ఈపీఎఫ్ఓ ప్రమోషన్లు, బదిలీలపై కేంద్ర కార్మిక శాఖ విచారణ జరపాలి

**చిక్కడపల్లి జులై 8 ( ప్రభాతవార్త ) :** ఈపీఎఫ్ఓ రంగారెడ్డి హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో ఇటీవల జరిగిన అధికారుల ప్రమోషన్లు, బదిలీలలో నిబంధనల ఉల్లంఘనలు, భారీ అక్రమాలు జరిగాయని తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్ట్ , మైగ్రెంట్ లేబర్ యూనియన్ అధ్యక్షుడు డాక్టర్ కె.రంగారావు ఆరోపించారు. బుధవారం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వాస్తవానికి ఈపీఎఫ్ఓ నిబంధనల ప్రకారం అధికారుల ప్రమోషన్లు, బదిలీలు ఒక రాష్ట్రం నుండి మరో రాష్ట్రానికి జరగాల్సి ఉండగా, దానికి విరుద్ధంగా కేవలం 50 కిలోమీటర్ల పరిధిలోనే బదిలీలు పూర్తి చేయడం వెనుక పెద్ద ఎత్తున అవినీతి దాగి ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ అక్రమాలపై కేంద్ర కార్మిక శాఖ తక్షణమే స్పందించి, ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు మరింత మెరుగైన సేవలు అందించేలా ఈపీఎఫ్ఓ పాలసీలలో మార్పులు తీసుకురావాల్సిన సీబీటీ సభ్యులు.. కేవలం అధికారుల వ్యక్తిగత పనుల చుట్టూనే తిరుగుతూ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని రంగారావు విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి విచారణ జరిపి కార్మికులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో కేంద్ర ఈపీఎఫ్ఓ కార్యాలయం ముట్టడితో పాటు భారీ మహా ప్రదర్శన నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

### నాలుగు నాణ్యతా ప్రమాణాల గుర్తింపు సాధించిన తొలి విశ్వవిద్యాలయంగా ఓ.యూ



**తార్నాక, జులై 8 ప్రభాతవార్త :** శతాబ్దానికి పైగా ఉన్నత విద్యా సేవలందిస్తున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం మరో ప్రతిష్ఠాత్మక మైలురాయిని అధిగమించింది. దేశంలోనే నాలుగు విభాగాల్లో నాణ్యతా ప్రమాణాల ధృవీకరణ పొందిన తొలి విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందింది. విశ్వవిద్యాలయ పరిపాలనా భవనంలోని సెనెట్ హాలులో జరిగిన కార్యక్రమంలో భారతీయ ప్రమాణాల సంస్థ అధికారులు ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరంకు ధృవీకరణ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ, నాణ్యమైన విద్య, పర్యావరణ పరిరక్షణ, ఇంధన వినియోగ సామర్థ్యం, ఆహార భద్రత, సమర్థవంతమైన పరిపాలనకు విశ్వవిద్యాలయం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ఈ గుర్తింపు అధ్యాపకులు, అధికారులు, సిబ్బంది సమిష్టి కృషికి నిదర్శనమని పేర్కొన్నారు.భారతీయ ప్రమాణాల సంస్థ అధికారులు ఉస్మానియా విశ్వవిద్యాలయం నాణ్యత, పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనలో చూపుతున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి. నరేష్ రెడ్డి, అంతర్గత నాణ్యతా విభాగం సంచాలకులు ఆచార్య బి. శిరీష, అధ్యాపకులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళలపై వేధింపులు

### - వేర్వేరు సంఘటనల్లో ఫిర్యాదులు

**జూబ్లీహిల్స్, జులై 8, ప్రభాతవార్తః**
పెళ్లి పేరుతో మోసగించిన వారు ఒకరు.. మరో మహిళలకు మాజీ యజమాని నిరంతరం వేధింపులు.. మరో మహిళతో అగంతకుడు అసభ్య ప్రవర్తన.. బీటెక్ యువతికి సామాజిక మాధ్యమాల ద్వారా వేధింపులు..ఇలా నాలుగు సంఘటనల్లో మహిళలు వేధింపులకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. బోరబండ ఠాణా పరిధిలో ఒక మహిళను తిమ్మాపురం నవీన్ అనే ఫిజియోథెరపిస్ట్ పెళ్లి పేరుతో నమ్మించి దాదాపు ఎనిమిదేళ్లపాటు ఆమెకు సన్నిహితంగా మెలిగాడు. మరో యువతిని మోసం చేసుకోవడంతోపాటు ఆమెకు దూరంగా ఉండటంతో మహిళ బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో సంఘటనలో మాజీ యజమాని ఓ మహిళను నిరంతరం వేధిస్తూ బెదిరింపులకు పాల్పడటంతో మహిళ బోరబండ పోలీసులను ఆశ్రయించింది. బంజారానగర్‌కు చెందిన పప్పు అలియాస్ సంజయ్‌కి చెందిన ఇంట్లో గతంలో అద్దెకు ఉన్న సమయంలో నుంచి వేధించేవాడు. ఏడాది క్రితం ఇళ్లు ఖాళీ చేసినప్పటికి గత వారం రోజులుగా ఇంటి వద్దకు వచ్చి అసభ్యపద జాలంతో దూషిస్తున్నాడు. ఉద్యోగానికి వెళ్లే సమయంలో బైకుపై ఎక్కాలంటూ బలవంతం చేశాడు. నిరాకరించడంతో పిల్లలను చంపేస్తానంటూ బెదిరించాడు. మరుసటి రోజు ఇలానే వెంటపడటంతో మహిళ బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిల్మ్‌నగర్ ఠాణా పరిధిలో ద్విచక్రవాహనంపై వచ్చిన ఒక అగంతకుడు అటుగా వెళ్తున్న ఒక మహిళ పట్ల అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించాడు. అసభ్యంగా తాకి అక్కడి నుంచి పరారయ్యాడు. మహిళ ఫిర్యాదుతో ఫిల్మ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇక ఎస్సార్‌నగర్ ఠాణా పరిధిలో బీటెక్ చదివిన ఒక యువతి(26) ఇంట్లో అద్దెకున్న తరుణ్ ఉద్యోగం పేరుతో దగ్గరయ్యాడు. పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో యువతి తిరస్కరించింది. దీంతో నిత్యం వేధింపులకు పాల్పడటమే కాకుండా సామాజిక మాధ్యమాల ద్వారా యువతిని మరింతగా వేధించడం ప్రారంభవించాడు. యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 10 మందికి జైలు శిక్ష

**చిక్కడపల్లి జులై 8 ( ప్రభాతవార్త ) :** మద్యం సేవించి వాహనాలు నడిపిన 24 మందిని చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసులు బుధవారం కోర్టులో హాజరుపరిచారు. నిందితులను పరిశీలించిన న్యాయమూర్తి 14 మందికి జరిమానాతో పాటు సామాజిక సేవా శిక్షను ఖరారు చేశారు. అదేవిధంగా, గతంలోనూ మద్యం సేవించి దొరికి, రెండోసారి కూడా అదే నేరానికి పాల్పడిన 10 మంది వాహనదారులకు తీవ్రతను బట్టి 3 రోజుల పాటు జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఈ సందర్భంగా నిందితుల నుంచి మొత్తం రూ. 1,42,200 జరిమానా వసూలు చేసినట్లు చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె. ఏడుకొండలు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

### రేషన్ బియ్యం,గోధుములు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం,గోధుములు

**మైలార్‌దేవ్‌పల్లి, జులై 8 ప్రభాతవార్త :**
అక్రమంగా రేషన్ బియ్యం.గోధుములు గోదాంలో నిల్వ ఉంచి అమ్ముతున్న ఓవ్యక్తిని మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.పోలీసుల కథనం ప్రకా రం.... పాతబస్తీజహానుమా,నవాబ్‌షాహెబ్‌కుంట,ఎంసిహెచ్ కాలనీకి చెందిన మీర్ అహ్మద్ అలీ (39) పలు ప్రాంతాలలోని ప్రజలు నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యం,గోధుమలను కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడు.కొనుగోలు చేసినరేషన్ బియ్యం,గోధుమలను హౌసింగ్ బోర్డు కాలనీలోని ఓ రూమ్ లో నిల్వ ఉంచాడు.సమాచారం అందుకున్న మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు బుధవారం మధ్యాహ్నం దాడి చేసి రూమ్‌లో నిల్వ ఉంచిన నాలుగు క్వింటాల రేషన్ బియ్యం,నాలుగు క్వింటాల గోధుమలను స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు కేసును విచారిస్తున్నారు.

## స్పందించిన బల్దియా...వెలిగిన వీధి దీపాలు


శివగంగానగర్‌లో వీధి దీపాలకు మరమ్మతులు చేస్తున్న బల్దియా సిబ్బంది

**చాంద్రాయణగుట్ట, జులై 8, ప్రభాతవార్త :** గత కొన్ని రోజులుగా మరమ్మతులకు నోచుకోక అలంకార ప్రాయంగా మారిన వీధి దీపాలు కాంతులు వెదజల్లాయి. బస్తీలో కమ్ముకున్న కారు చీకట్లు తొలగిపోయాయి. మంగళవారం 'వెలగని వీధి దీపం...ఎవరిదీ ఈ భారం' అన్న శీర్షికన ప్రచురితమైన 'వార్త' కథనానికి జీహెచ్ఎంసి రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి స్పందించారు. పనిచేయని వీధి దీపాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని జోన్ ఎలక్ట్రికల్ డిఇ సత్యనారాయణరెడ్డికి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఎలక్ట్రికల్ సిబ్బంది మంగళవారం రాత్రి పలు బస్తీలలో పర్యటించి పనిచేయని వీధి దీపాలను గుర్తించారు. బుధవారం ఆయా దీపాలకు మరమ్మతులు చేశారు. దీంతో గత కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలుగక అంధకారం అలముకున్న బస్తీలలో తిరిగి వెలుగులు పరుచుకున్నాయి. బస్తీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. బల్దియా అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

### డ్రైనేజీ వ్యవస్థపై దృష్టి సారించండి : శాంతి శ్రీనివాస్ రెడ్డి


డ్రైనేజీని పరిశీలిస్తున్న శాంతి శ్రీనివాస్ రెడ్డి

**అల్వాల్, జులై 8 ప్రభాతవార్త:** డ్రైనేజీ వ్యవస్థను సమర్ధవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని అల్వాల్ మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని జెజె నగర్, రామ్‌నగర్ ప్రాంతాలులో మాజీ కార్పొరేటర్ పర్యటించారు. జెజె నగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణలో వస్తున్న ఇబ్బందులు స్థానికులు తెలిపారు. అసంపూర్తిగా పార్కు అభివృద్ధి, విద్యుత్ స్థంబాలు సమస్యలను ప్రధానంగా ఆమె దృష్టికి వచ్చాయి. సమస్యలు అన్నింటిని త్వరలోనే పరిష్కరిస్తామని శాంతి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు.

## ఉద్యమకారుల దీక్షా శిబిరానికి ప్రత్యామ్నాయ స్థలం కేటాయించండి


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందిస్తున్న ఉద్యమకారులు

**అల్వాల్, జులై 8 ప్రభాతవార్త:** ఉద్యమకారుల దీక్షా శిబిరం రోడ్డు వెడల్పులో ఉనికిని కోల్పోనున్న నేపధ్యంలో ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించాలని అల్వాల్ ఉద్యమకారులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. బుధవారం జెఎసి నేత సురేందర్ రెడ్డి నేతృత్వంలో ఎమ్మెల్యేను కలవడం జరిగింది. దక్షిణ తెలంగాణా ప్రాంతానికి గేట్‌వేగా అల్వాల్ ఉద్యమకారుల దీక్షా శిబిరం పని చేసిందని వారు పేర్కొన్నారు. స్థానికంగా ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష ఈ శిబిరం ద్వారా ప్రారంభమైందని వారు గుర్తు చేశారు. ఎలివేటెడ్ కారిడార్‌లో బాగంగా రోడ్డు విస్తరణలో దీక్షా శిబిరం ఉనికి ప్రశ్నార్ధకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేవుని అల్వాల్‌లోని గ్రామ కంఠానికి చెందిన స్థలంలో తమకు కొంత స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేను వారు కోరారు. ఈ కార్యక్రమంలో పుట్నాల కృష్ణ, సుధీర్, ఆంజనేయులు, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### దేశంలో తొలి ఏఐ ఆధారిత సీవర్ గవర్నెన్స్ ప్రాజెక్ట్ శుద్ద్

**నాంపల్లి, జులై 8 ప్రభాతవార్త :** నగరపాలక సంస్థల పారిశుద్ధ కార్మికులు మురుగు కాలువల్లోకి దిగేరోజులకు స్వస్తిపలుకుతూ భారతదేశంలోనే తొలి ఏఐ ఆధారిత సీవర్ గవర్నెన్స్ ప్రాజెక్ట్ శుద్ధ్‌ను హైదరాబాద్‌కు చెందిన డీప్‌టెక్ సంస్థ ది బాట్ ఫ్యాక్టరీ అభివృద్ధి చేసింది. రోబోటిక్స్, ఏఐ, జీఐఎస్, ప్రిడిక్టివ్ అనలిటిక్స్ సంయుక్తంగా ది బాట్ ఫ్యాక్టరీ రూపొందించిన ప్రాజెక్ట్ శుద్ధ్‌ను జూలై 11న టీవర్క్‌లో ఐటి, ఎలక్ట్రానిక్స్, కమ్యూ నికేషన్స్, పరిశ్రమలు అండ్ వాణిజ్యశాఖల మంత్రి డి.శ్రీధర్‌బాబు ముఖ్యఅతిథిగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా అండ్ స్ట్రోర్ట్స్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్‌రంజన్, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు తదితరులతో కలిసి ఆవిష్కరించనున్నారు. మానవసహిత సమస్యకు సాంకేతిక పరిష్కారం కనుగొనే ప్రక్రియకు శ్రీకారం చుట్టిన ఈ సంస్థ హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సీవరేజ్ బోర్డు సహకారంతో విజయవం తంగా పరీక్షలు నిర్వహించి ఆవిష్కరణకు సంసిద్ధమైంది. సురక్షిత నగరాలు, స్మార్ట్ గవర్నెన్స్ మరియు ప్రమాదకర మురుగు కాలు వల శుభ్రపరిచే పనులకు ముగింపు పలికే దిశగా ఇదొక చారిత్రా త్మక అడుగన్నారు. విపత్తు నిర్వహణ (డిజాస్టర్ మేనేజ్‌మెంట్) రోబోటిక్స్ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేసిన ఈ ప్రాజెక్ట్ సంప్రదాయ సీవర్ క్లీనింగ్ భావనను దాటి సీవర్ గవర్నెన్స్ అనే కొత్తదిశకు రూపుదిద్దింది. ఈ వ్యవస్థను అభివృద్ధి చేయడంతో భద్రత, శుభ్రత సామర్థ్యం పెంపు, పనులలో జవాబుదారీతనాన్ని పెంచడమే ధ్యేయంగా ఈ యంత్రాలు తీర్చిదిద్దారు.

## అంధ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి


అంధ విద్యార్థులలోని ప్రతిభా పాటవాలను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈవో సుమన్

**చాంద్రాయణగుట్ట, జులై 8, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అంధ విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను అందిపుచ్చుకొని భవిష్యత్‌ను ఉత్తమంగా తీర్చిదిద్దుకోవాలని బహదూర్‌పురా జోన్ ఉప విద్యాశాఖ అధికారి (డిప్యూటీ ఈవో) ఆర్.సుమన్ కోరారు. అంధ విద్యార్థులు ఎందులోను తీసిపోరని, ఐఎఎస్, ఐపిఎస్‌లుగా ఎదగాలన్నారు. బుధవారం దారుల్‌షిఫా ప్రభుత్వ బాలుర అంధుల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి అవసరాలను, విద్యా ప్రమాణాలను తెలుసుకున్నారు. వసతి గృహాన్ని సందర్శించి అక్కడి భోజన సదుపాయాలను వార్డన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సుమన్ మాట్లాడుతూ విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య, రాత పుస్తకాలు, యూనిఫారమ్, హాస్టల్ వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. బాగా కష్టపడి చదువుకోవాలని, రిజర్వేషన్‌ను ఉపయోగించుకొని జీవితంలో స్థిరపడాలని సూచించారు. విద్యార్థులు ఇచ్చిన సమాధానాలతో సంతృప్తి చెందారు. చదువుతోపాటు సాంస్కృతిక రంగాలలో రాణిస్తుండటం అభినందనీయమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను తల్లిదండ్రులకు వివరించి అడ్మిషన్లు పెంచుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సద్గుణ, మందడి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**శాలిబండ జీజీహెచ్ఎస్‌లో...**

సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్ స్టడీస్ (ఎన్.సి.ఈ.ఆర్.టి.) ప్రతినిధి టి.వెంకటేష్ బుధవారం శాలిబండ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. సోషల్ ఆడిట్ నిర్వహించి విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో విడివిడిగా సమావేశమైయ్యారు. పాఠశాలలో మరుగుదొడ్లు, గ్రంథాలయం, ప్రయోగశాల, మధ్యాహ్న భోజనం, మంచినీటి సదుపాయం, మౌళిక వసతులు తదితరాలను అధ్యయనం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు అంజలి కుమారి, మధుసూదన్ రావు, మంజుల, నవనీత, యాకుబ్, విజయ భాస్కర్, సంధ్య, సుధేష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గురు బ్రహ్మనగర్‌లో మౌలిక వసతుల దుస్థితి


గురుబ్రహ్మనగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న మన్నె గోవర్ధన్‌రెడ్డి.

**జూబ్లీహిల్స్, జులై 8, ప్రభాతవార్త:** ఖైరతాబాద్ నియోజకవర్గంలోని వెంకటేశ్వర కాలనీ డివిజన్ గురు బ్రహ్మనగర్‌లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలు స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వీధి దీపాలు లేకపోవడం, మూడు సంవత్సరాలుగా హైమాస్ట్ లైట్లు వెలగకపోవడం, ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వాహనాలు అతివేగంగా దూసుకెళ్తుండటంతో పాఠశాల విద్యార్థులు, స్థానికులు ప్రమాదాల భయంతో జీవనం సాగిస్తున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న సమస్యలపై సమరం కార్యక్రమంలో భాగంగా ఖైరతాబాద్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి గురుబ్రహ్మనగర్‌లో పర్యటించి ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఆరు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, దెబ్బతిన్న రోడ్లను మరమ్మతు చేయాలని, తాగునీటి సరఫరాను మెరుగుపరచాలని కోరారు. ఈ సందర్భంగా మన్నె గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ప్రజలు పలుమార్లు విజ్ఞప్తి చేసినా అధికారులు స్పందించడం లేదని, కనీస మౌలిక వసతులు కూడా కల్పించలేని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. అనంతరం జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఆయన, గురు బ్రహ్మనగర్‌లో వెంటనే వీధి దీపాలను ఏర్పాటు చేయడం, రెండు వీధుల్లో కొత్త రోడ్లు వేయడం, తాగునీటి సరఫరాను సమయపాలనతో అందించడంతో పాటు తగిన ఒత్తిడితో నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

### బిఎల్ఓలకు తక్షణమే గౌరవ వేతనం చెల్లించాలి



**కంటోన్మెంట్, జులై 8 ప్రభాతార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఎస్.ఐ. ఆర్.సర్వేలో పనిచేస్తున్న బి.ఎల్.ఓలకు తక్షణమే పెండింగ్ గౌరవ వేతనం చెల్లించాలని కాంగ్రెస్ నేతలు సంకి రవిందర్, బద్రి నాథ్ యాదవ్‌లు, బోర్డు హెల్త్ సూపరిండెంట్, ఎన్నికల ఏఈ.ఆర్. ఓ.ఎం దేవేందర్‌కు వినతిపత్రం అందజేశారు. బుధవారం నియోజకవర్గంలో పనిచేస్తున్న 231 మంది బి.ఎల్.ఓలు ఎస్.ఐ.ఆర్ చేపడుతున్నారు. అయితే వారికి 2024 నుంచి గౌరవ వేతనం చెల్లించడం లేదని, అందువల్ల తమకు రావాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బి.ఎల్.ఓలు తమ విధులను బహిష్కరించి కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ కో ఆర్డినేటర్లు సి.బద్రి నాథ్ యాదవ్, సంకి రవిందర్‌లు ఎమ్మెల్యే అదేశాల మేరకు ధర్నా నిర్వహిస్తున్న బి.ఎల్.ఓలతో ఎన్నికల సంఘం ఏఈ.ఆర్.ఓ.దేవేందర్‌లతో చర్చించి సమస్య పరిష్కారం అయ్యే విధంగా ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో వారి సమస్య సద్దు మనిగింది.

### గుండె కవాట మార్పిడి సాధ్యం : డాక్టర్ ప్రమోద్


మీడియాతో మాట్లాడుతున్న సికింద్రాబాద్ మెడికవర్ ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ ప్రమోద్ తదితరులు

**కంటోన్మెంట్, జులై 8 ప్రభాతార్త:** ఓపెన్ హార్ట్‌సర్జరీ లేకుండానే గుండె కవాట మార్పిడితో సాధ్యం అతుందని మెడికవర్ ఆసుపత్రి ఛీఫ్ కార్డియాలజీ, డైరెక్టర్ డాక్టర్ ప్రమోద్ కుమార్ కుచులకంటి తెలిపారు. బుధవారం సికింద్రాబాద్ సంగీత్ చౌరస్తాలోని మెడికవర్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుండె సంబంధిత వ్యాధుల చికిత్సలో తవాయ్ తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులను వివరించారు. ఓపెన్ హార్ట్ సర్జరీలో ఛాతిని తెరవాల్సి ఉండగా తవాయ్ విధానంలో రక్తనాలం ద్వారా సన్నని క్యాథెటర్ సహాయంతో అయోర్టిక్ వాల్వ్‌ను మార్చవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాగర్ చంద్రశేఖర్, డాక్టర్ బాలసుబ్రమణ్యం, సెంటర్ హెడ్ క్రిష్ణవేణి, మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

## నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

**నార్సింగి, జులై 8 ప్రభాతవార్త :** కరెంటు తీగల మధ్యలోకి వచ్చిన చెట్ల కొమ్మలను తొలగించేందుకు నేడు ఈ క్రింది ప్రాంతాలలో కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నామని నార్సింగి ఏఈ వి.మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ యార్డు సబ్‌స్టేషన్ 11.కేవీ నెమలీనగర్ ఫీడర్ పరిధిలో మైహోం అవతార్ సర్కిల్, నెమలీనగర్ రోడ్లలో ఉదయం 10.గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 11.కేవీ వైఎస్సార్ ఫీడర్ పరిధిలోని కాస్వాకాలనీ, మర్వ టౌన్‌షిప్, రిజిస్ట్రేషన్ కార్యాలయం ముందు, వైఎస్సార్ జంక్షన్ డిమార్ట్, మాంగళ్యా షాపింగ్‌మాల్, అక్యురేట్ ప్రాంతాలలో మధ్యాహ్నం 2.గంటల నుంచి సాయంత్రం 5.గంటల వరకు, 11.కేవీ. వివేకానంద ఫీడర్ పరిధిలోని నార్సింగి గ్రామం, నార్సింగి హైట్స్, కాబా కాలనీ, మర్వ టౌన్‌షిప్, 60.ఫీట్ల రోడ్డు, సాయిబాబా ట్రస్ట్, మల్లన్న దేవాలయం ప్రాంతాలలో మధ్యాహ్నం 2.గంటల నుంచి సాయంత్రం 5.గంటల వరకు 11.కేవీ సాయిబాబా ఫీడర్ పరిధిలోని నార్సింగి పాతగ్రామం, బాలికల వసతి గృహం, గిరిగిరి గడ్డ, సాయిబాబా దేవాలయం రోడ్డు, ముప్పా అపార్ట్‌మెంట్స్, యాదిలాల్ ఓఆర్ఆర్ సర్కిల్ రోడ్డు ప్రాంతాలలో మధ్యాహ్నం 2.గంటల నుంచి సాయంత్రం 5.గంటల వరకు కరెంటు సరఫరాను నిలివేస్తున్నట్లు తెలిపారు. అలాగే వట్టినాగులపల్లి సబ్‌స్టేషన్ 11.కేవీ లన్సమ్ ఫీడర్ పరిధిలోని లన్సమ్‌లో ఉదయం 10.గంటల నుంచి మధ్యాహ్నం ఒకటి గంటల వరకు, 11.కేవీ మైస్పేస్ ఫీడర్ పరిధిలోని లిసా గ్రోవ్, జయభేరి పార్క్, శంకర హాస్పిటల్, కండ్యూర్ బిల్డింగ్ ప్రాంతాలలో ఉదయం 10.గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 11. కేవీ జయభేరీ ఫీడర్ పరిధిలోని శ్రీహిల్స్, ప్రధాన కన్వెన్షన్, అన్వయ కన్వెన్షన్, జయభేరి సర్వీస్ రోడ్డు ప్రాంతాలలో ఉదయం 10.గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నామని, ఇందుకు విద్యుత్ వినియోగదారులంతా మాకు సహకరించాలని ఏఈ వి.మణికంఠ పేర్కొన్నారు.

## డ్రగ్స్ వ్యాపారులు, సరఫరాదారులపై ఉక్కుపాదం : ఈగల్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు



నషా ముక్త్ భారత్ అభియాన్ సమగ్ర అవగాహన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు

**చిక్కడపల్లి జులై 8 ( ప్రభాతవార్త ) :** మాదకద్రవ్య రహిత సమాజ స్థాపనకు చట్టాన్ని అమలు చేసే సంస్థలు, విద్యాసంస్థలు, సమాజం , పౌరులు సమన్వయంతో ముందుకు సాగాలని తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం బాగ్ లింగంపల్లి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళాశాలలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో బుధవారం నషా ముక్త్ భారత్ అభియాన్ సమగ్ర అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మాదకద్రవ్యాల మహమ్మారిని అంతమొందించడానికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, సమష్టి కృషితోనే ఈ పోరాటంలో విజయం సాధించగలమని స్పష్టం చేశారు. నషా ముక్త్ భారత్ అభియాన్ మూడు ప్రధాన లక్ష్యాలతో పనిచేస్తుందని ఇన్‌స్పెక్టర్ వివరించారు. డ్రగ్స్ వ్యాపారులు, సరఫరాదారులపై ఉక్కుపాదం మోపడం జరుగుతుందని, యువత, విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా చైతన్యపరచడం, వ్యసనపరులను ఆ బారి నుంచి విముక్తులను చేసి, వారికి సమాజంలో తిరిగి గౌరవప్రదమైన స్థానం కల్పించడం."మాదకద్రవ్యాల అక్రమ రవాణా దేశ యువతకు పెద్ద ముప్పుగా మారింది. నిందితులు ముఖ్యంగా విద్యార్థులను, విద్యాసంస్థలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ నెట్‌వర్క్‌లను గుర్తించడానికి, వాటిని నిర్మూలించడానికి తెలంగాణ పోలీసులు నిరంతర నిఘా ఉంచారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి 1908 టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ ద్వారా సమాచారం అందించి పోలీసులకు సహకరించాలన్నారు. పీఐబీ, సీబీసీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన, సురక్షితమైన, మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించాలనే ప్రభుత్వ సంకల్పాన్ని నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిబింబిస్తోందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బి ఆర్ అంబెద్కర్ విద్యాసంస్థల సీఈఓ ప్రొఫెసర్ లింబాద్రి , ఎవాల్యుయేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ యాదగిరి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ మట్టా, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

### అర్హులైన వారి ఓట్లు గల్లంతు కాకుండా చూడాలి


ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తున్న గుర్రం పవన్‌కుమార్ గౌడ్

**సికింద్రాబాద్, జులై 8 ప్రభాతవార్త:** అర్హులైన ఓటర్ల పేర్లు ఓటరు జాబితాలో గల్లంతు కాకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బీఆర్ఎస్ పద్మారావునగర్ ఇంచార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్ అధికారులను కోరారు. పద్మారావునగర్‌లో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఓటర్లు తమ పేర్లను పరిశీలించుకోవాలన్నారు. పేర్లు లేని పక్షంలో కొత్తగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

### దైవ నామస్మరణంతో సర్వపాపాలు హరించబడతాయి : ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


అల్కాపూర్‌లోని శ్రీ సీతారామచంద్ర స్వామి మూడో వార్షిక బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

**నార్సింగి, జులై 8 ప్రభాతవార్త :** దైవ నామ స్మరణంతో సర్వ పాపాలు హరించబడుతాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం నెక్‌నాంపూర్ అల్కాపూర్ కాలనీలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ మూడో వార్షికోత్సవ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. మంగళవాయిద్యాలు, వందలాది మంది భక్తజనుల జయ జయ ధ్వనుల మధ్య శాస్త్రోక్తంగా వేద పండితులు స్వామి వారి కళ్యాణోత్సవంను, ఇతర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పాల్గొని ఆలయ గర్భగుడికి నూతనంగా ఏర్పాటు చేసిన వెండి తలుపులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలన్నారు. మనకు ఎన్ని ఒత్తిడులున్నా నిత్యం దేవాలయాలకు వెళ్లి దైవ దర్శనం చేసుకుంటే మనలోని చెడు అంత హరించబడి మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. పెద్దలంతా సనాతన ధర్మంను ఆచరిస్తూ వారి బిడ్డలతో ఆచరింపచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తలారి మల్లేష్, రామకృష్ణారెడ్డి, బాల్‌రెడ్డి, ఏర్పుల కుమార్, పుల్లారావ్, శ్రీహరి పాల్గొన్నారు.

### కాలనీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

**కుత్బుల్లాపూర్, జులై 8, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని చింతల్ సర్కిల్‌లో బుధవారం నిర్వహించిన ఆల్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుల సమావేశంలో జీహెచ్ఎంసీ కమిషనర్ సృజన పాల్గొన్నారు. వివిధ కాలనీలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకురాగా, వాటిని క్షుణ్ణంగా విన్న ఆమె సంబంధిత శాఖల అధికారులు తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా తాగునీటి సరఫరా, డ్రైనేజీ, పారిశుధ్యం, రహదారులు, వీధి దీపాలు, వర్షపు నీటి పారుదల, చెత్త సేకరణ వంటి పలు మౌలిక సదుపాయాల సమస్యలపై చర్చ జరిగింది. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించే దిశగా శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి పెండింగ్ సమస్యలను వేగంగా పరిష్కరించాలని కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేశ్ కుమార్, డి ప్యూటీ కమిషనర్ స్పందన, వాటర్ వర్క్స్ డీజీఎం వికాస్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

### ఘనంగా కట్టమైసమ్మ దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు


శ్రీకట్టమైసమ్మ అమ్మవారి ఆలయంలో జరిగిన బ్రహోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, తదితరులు

**శేరిలింగంపల్లి, జులై 8 ప్రభాతవార్త**

శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని తారానగర్‌లో కొలువైన శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ అమ్మవారి దేవాలయంలో 12 వ వార్షిక బ్రహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక హోమాలు, పూజా కార్యక్రమాలను స్థానిక సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉరిటి వెంకట్రావు, వసుందర దేవి దంపతుల సమక్షంలో అత్యంత వైభవంగా జరిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ పీఏసీ ఛైర్మన్, శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరికెపూడి గాంధీ, తెలంగాణ రాష్ట్ర కురుమ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ మారబోయిన రఘునాథ్ యాదవ్ విచ్చేసి అమ్మవారికి ప్రత్యేకంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో విశేష పూజలు, చండీ హోమాలు, రుద్రహోమం, కుంకుమార్చన గావించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీ కట్టమైసమ్మ అమ్మవారి కరుణా కటాక్షాలతో శేరిలింగంపల్లి నియోజక వర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో జీవించాలన్నారు. ఆలయ ధర్మకర్తల ఉరిటి వెంకట్రావు, వసుందర దేవి దంపతుల నేతృత్వంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రవీందర్‌రావు, వీరేశం గౌడ్, సీనియర్ కాంగ్రెస్‌నాయకులు మిరియాల రాఘవరావు, ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, ప్రవీణ్, బీసీ ఐ క్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచందర్‌యాదవ్, స్థానిక నాయకులు సురేందర్‌రెడ్డి, బీసీ నాయకులు సుదాకర్, వెంకటర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### టిజి20 క్రికెట్ లీగ్ -ప్లేఆఫ్‌లో 'రంగారెడ్డి రైజర్స్'

**వరంగల్ వారియర్స్‌పై 161 పరుగుల తేడాతో ఘనవిజయం**



**హైదరాబాద్, జులై 8, ప్రభాతవార్త:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న శ్రీనిధి యూనివర్సిటీ టిజి20 టోర్నమెంట్‌లో లీగ్ దశ చివరి మ్యాచ్‌లో రంగారెడ్డి రైజర్స్ జట్టు వరంగల్ వారియర్స్‌పై 161 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించి అద్భుతమైన మలుపు తిప్పింది. నెట్ రన్ రేట్‌లో అనురాగ్ నల్గొండ నైట్స్‌ను అధిగమించాలంటే కనీసం 130 పరుగుల తేడాతో గెలవాల్సి ఉండగా, రైజర్స్ అంతకంటే మెరుగ్గా రాణించి నైట్స్ జట్టు ప్రయాణాన్ని ముగించి, ప్లేఆఫ్‌లోకి అడుగుపెట్టింది. రంగారెడ్డి రైజర్స్: 20 ఓవర్లలో 252/6 పరుగులుచేసింది. మొదట్లో 1/2తో తడబడి మొదలైనా, ఆరోన్ జార్జ్ (43 బంతుల్లో 91) ఆదిత్య జవ్వాజీ (36 బంతుల్లో 77) మధ్య మూడో వికెట్‌కు 163 పరుగుల భాగస్వామ్యంతో (సీజన్ అత్యధిక భాగస్వామ్యం)తో కోలుకుంది. ఎస్. వెంకట్ కార్తీక్ 26 బంతుల్లో అజేయంగా 51 పరుగులు చేశాడు. వరంగల్ వారియర్స్ కేవలం 12.3 ఓవర్లలో 91 పరుగులకే ఆలౌట్ అయ్యింది. అమన్ రావు పెరాల 31 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు.


తెలంగాణ ప్రభుత్వం
సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

NIT No : 25/EE/CIR-49/SLPZ/CMC/1-2/2026-27 తేది: 08.07.2026

నిట్ నం. పైన పేర్కొన్నది. పని యొక్క తరగతి : సివిల్ మరియు ఇతర పని. అంచనా మొత్తం (రూ.లక్షలలో) 69.90. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం: 10.07.2026 మ.3.00గం. 17.07.2026 మ.3.00గం. అధికారి పేరు, చిరునామా, సెల్ నం.: EE, CIR-49, SLPZ, CMC 9000115410.

సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-49, CMC.

DIPR.NO. 5744-PP/CL/ADVT/1/2026-27 తేది: 08.07.2026


## యువతలో స్వీయరక్షణ, నైపుణ్యాలు పెంపొందించడంలో మార్షల్ ఆర్ట్స్ కీలకం


త్రినాధ మార్షల్ అకాడమీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న వడ్డెపల్లి రాజేశ్వరరావు

**కెపిహెచ్‌బి కాలనీ, జులై 8, ప్రభాతవార్త**

కూకట్‌పల్లి వివేకానంద నగర్‌లోని త్రినాథ్ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ స్పోర్ట్స్ ఫిట్‌నెస్ అకాడమీ నూతన శాఖను బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై అకాడమీని ప్రారంభించి నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, స్వీయరక్షణ నైపుణ్యాలను పెంపొందించడంలో మార్షల్ ఆర్ట్స్ కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. నేటి సమాజంలో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక దృఢత్వం కూడా ఎంతో అవసరమని, అందుకు ఇలాంటి ఫిట్‌నెస్, మార్షల్ ఆర్ట్స్ అకాడమీలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అకాడమీలో శిక్షణ పొందుతున్న చిన్నారులు, విద్యార్థులు ప్రదర్శించిన కరాటే, కిక్‌బాక్సింగ్ విన్యాసాలను వీక్షి ంచిన రాజేశ్వరరావు వారి ప్రతిభను కొనియాడారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి తెలంగాణకు, దేశానికి కీర్తి తీసుకురావాలని విద్యార్థులకు ఆకాంక్షి ంచారు. అకాడమీ వ్యవస్థాపకులు త్రినాథ్‌కి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, యువతను ఆరోగ్యవంతమైన, క్రమశిక్షణతో కూడిన జీవితానికి తీర్చిదిద్దే ఈ ప్రయత్నం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.


**PUBLIC NOTICE**

Members of the General Public are hereby informed that my clients 1. A.Raj Reddy S/o Late A.Achaiah 2. A.Surender Raj S/o A.Raj Reddy 3.Ravinder Raj S/o Raj Reddy all are R/o. 16-9-345 to 347 Old Malakpet Hyderabad,who are the absolute owners and possessors of House no mentioned above having partitioned among them,the same was Registered as Partition Deed bearing No.1917 dated 04-08-1993, the original partition deed in respect of the above said premises has lost during travelling within the jurisdiction of the Chaderghat police station limits.In the event of the said original Partition deed being found out by any member of the general public, they are requested to kindly handover the document to the undersigned.In such an event the said person would be rewarded suitably by my client.

Note :The public is hereby cautioned/warned not to deal, purchase, or carry out any transaction regarding the said property on the basis of the missing document.

E.SURESH KUMAR
Advocate
16-10-27/150, Yashoda hospital lane, Malakpet
Hyderabad, T.S.
Ph: 98490-36868

IN THE COURT OF THE HON'BLEPRL. JUNIOR CIVIL JUDGE CUM VII ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, MEDCHAL MALKAJGIRI DISTRICT. AT: MEDCHAL.
O.S NO: 429 OF 2026
BETWEEN:
Routhu Rama Devi & Others ..PLAINTIFFS
AND
1. The Tahsildar (Mandal Revenue Officer), Bachupally Mandal, Medchal Malkajgiri District.
2. All concerned. ..DEFENDANTS
To,
All Concerned. ..Defendant No:2
The general public is hereby informed that the plaintiffs herein have filed the above O.S No: 429 of 2026 to declare them as the legal heirsof Routhu Krishna Kumar. The said case is posted on 12-8-2026 before the Hon'ble Prl. Junior Civil Judge cum VII Addl. Judicial Magistrate of First Class,Medchal Malkajgiri District, At: Medchal.
That if any person/s or institution/s have any claim or objection in the above case, he/she/they may make appearance before the above stated Hon'ble court on 12-8-2026at 10.30 A.M with the objection/s if any, along documentary evidence in proof of their claim.
(By order of the Hon'ble Court)
M.P.K. ADITYA
ADVOCATE
Office at:3-6-369/A/10, Flat No. 4, 2nd Floor, Street No. 1, Himayathnagar, Hyderabad-29.

IN THE COURT OF THE HON'BLE I ADDL JUNIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT AT: KUKATPALLY
O.S.No.72 of 2026
Between:
Puli Kiran Reddy and another ....Plaintiff
AND
The Tahasildar, Kukatpally Mandal and others ...Defendants
NOTICE
To
All concerned
Please take notice that the above named Plaintiff have filed above suit for declaration to declare that the plaintiffs are the legal heir of the Deceased Late. Late. Shanmukha A.S. Reddy Puli, died on11.06.2025 and the above case posted for appearance on 10.08.2026 at 10.30 a.m. before above said Hon'ble Court. If any person (s) are having any objections may appear in person or through counsel on the above mentioned date and before the Hon'ble court. If any objections not received by the Hon'ble court, the Hon'ble will decide the matter on merits.
(By order of the Hon'ble Court)
Sri.Bhaskar Voggu
Advocate,
Plot No.87, Vinayaka nagar colony, Manikonda jagir, Ranga Reddy District,
Mob:9701732413
Counsel for Plaintiff

IN THE COURT OF THE HON'BLE 1st ADDL.DISTRICT & SESSIONS JUDGE AT: VIKARABAD
I.A.No.387 of 2025
IN
OS.No. 30 OF 2025
Between:
Goguri Devender Reddy ...Petitioner/Plaintiff
AND
Jantupalli. Padmamma and others ...Respondents/ defendants
To,
1. Smt. Jantupalli Padmamma, W/o Late Jantupalli Ramaswami Goud, Aged: 47 years, Occ: Household, R/o.H.No.4-29/1, Regadimailwar, Bomraspet Mandal, Vikarabad District 509338, Telangana
2. Smt. Suvarna W/o.Patnam Balraj Goud, Aged about: 37 years, Occ: Household, R/o.3753, New MIGBHEL, ViduthNagar, near Watertank, Ramachandrapuram, MedakDistrict-502032
3. Srikanth Goud S/o Late Jantupalli Ramaswami Goud, Aged about: 35 years, Occ: Pt. Employee, R/o.H.No.4-49, Regadimailwar, Bomraspet Mandal, VikarabadDistrict-509338, Telangana
NOTICE
Please take notice that the above named plaintiff filed a suit against you seeking a relief of specific performance of agreement of sale Dated 26-04-2024 in respect of property in Sy.No.69/A,Khata No.101, admeasuring Ac.6.16 Gts. Patta pass book No.896492 situated at Regadimailwar village, Bomraspet Mandal, Vikarabad District.The Hon'ble court has posted the matter for your appearance on 30-07-2026 at 10-30 AM before the above said Hon'ble court either in person or through your advocate.Other wise the Hon'ble court would proceed to grant the relief prayed for.
(ISSUED UNDER THE ORDERS OF THE COURT)
PARLAPELLI RAMADEVI
Advocate,
4th Lane,Plot No.103, Ramshankar Nagar, Ramanthapur, Hyderabad.
Mobile 9963966402

IN THE COURT OF THE V SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD
O.S No. 1545 Of 2025
Between:
STATE BANK OF INDIA, Himayatnagar Branch, Hyderabad. Rep. by its Asst. Manager. ...PLAINTIFF
And
Mr. Chandra Mohan Karram
To
Mr. Chandra Mohan Karram, S/o. Krishna Swamy, Aged about 59 Years, Occu: Junior Assistant, Legal Cell, OU Campus, Emp Id: 101245, R/o Qtr No. Old B/6, Opp: Engineering College, Osmania University, Hyderabad- 500 007, Ph:7702849940. ...DEFENDANT
Whereas SBI, Himayatnagar Branch, the plaintiff has instituted a suit against you for recovery of money, in the above-mentioned court at Hyderabad. The suit is posted on 14.08.2026.
You are hereby informed to appear either in person or by pleader before the Hon'ble V Senior Civil Judge, City Civil Court at Hyderabad on 14th August, 2026 at 10.30 AM, failure to appear in the court the matter will be decided Ex-parte.
// By order of the court //
M/s AJGAL RAVI BABU (TS1008/90)
K. Prabhu Kumar,
ADVOCATES
No. 1-8-702/35A, 601, 6th floor, Windsor Plaza, Near Shankarmutt Nallakunta, Hyderabad -500044

**PUBLIC NOTICE**

The general public is here by informed that My Client Sri, Bhalerao Naresh Babu S/o. Sri, Bhalerao Balakrishna Aged 42 Year Occupation Pvt Employee Resident of 1-84/14, Ram Nagar Colony, Parvath Nagar, Ghakesar, Medipalli, Ranga Reddy is the piece possessor of the Schedule of property. The Link Document of the Schedule of Property i.e., Registered Sale Deed No. 2992/2015, Dated 18-06-2015, with the office of SRO, Ghatkesar Was lost, while he was travelling from Ghatkeasr, to Parvathhapur., Thereafter my client logged a Police complaint in the concern police station Medipally they were issued Non traceable certificate in favor of my Client. If anybody found/traced the above said original document to be returned to my client or at my office.

If any person/s, Financial Institutions, Banks having any right title, claim or objections in respect of below mentioned property may Contact the undersigned within Seven (7) days from the date of publication of this notice with documentary evidence to substantiate their claim. After the expiry of Seven Days period no claim or whatever shall be entertained. SCHEDULE OF PROPERTY: All that the Open Plot No.59, in Survey Nos. 9, 10 & 12 Part, admeasuring 200 Square yards, or 167.22 Square meters, Situated at Parvathapur Village and Grampanchayath, Ghakesarmandal, Ranga Reddy District, T.S Bounded by:- BOUNDARIES. North Plot No.58, South Plot No. 60, East : Neighbor's Land, West: 30' Wide Road.

Sd/-CHANDRA SEKHAR SUNKU
ADVOCATE
H.No.8-3-191/24,6/B, SECOND FLOOR VENGAL RAO NAGAR COLONY, HYDERABAD - 500 038
PH No. 9247408839

## సంగీతంతో మనసుకు ప్రశాంతత : ఆంజనీకుమారి

**మలక్ పేట, జూలై 8, ప్రభాతవార్త:** సంగీతంతో మనస్సు కు ప్రశాంతత చేకూరుతుందని తెలంగాణ విశ్వ సాహితి ఉమెన్ చైర్ పర్సన్ అంజనీకుమారి, తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సలహాదారులు దరువు అంజన్నలు పేర్కొన్నారు. ప్రముఖ గాయకుడు, విశ్లేషకులు శరత్ కృష్ణ, సింధు యూట్యూబ్ అధినేత, కవి భార్గవ్ రామ, కృష్ణ, త్రినాథ్, రామ్ కుమార్ లు ఏర్పాటు చేసిన సంగీత విభావరి కార్యక్రమంలో ప్రముఖ గాయని ఆర్.కె. రమా కలిగొట్ల సుమారు పది గంటల పాటు 108 పాటలను అనర్గళంగా ఆలపించి అబ్దుల్ కలాం బుక్ ఆఫ్ రికార్డ్స్, నోబుల్ గ్లోబల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం సంపాదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాకారులలో దాగి ఉన్న ప్రతిభా ను వెలికి తీయడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణస్వామి, డాక్టర్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

## వైయస్ ప్రజలకు చేసిన సేవలు ఎనలేనివి: చౌకి రవికుమార్


వై.యస్. రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న చౌకి రవికుమార్ తదితరులు

**మలక్ పేట, జూలై 8, ప్రభాతవార్త:** దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రజలకు చేసిన సేవలు ఎనలేనివని గ్రేటర్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ పేర్కొన్నారు. డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని నాయకులు, కార్యకర్తలతో కలిసి చౌకి రవికుమార్ వైయస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహమ్మద్ గౌస్, తాటికొండ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డికి ఘన నివాళులు


వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రకాష్ రెడ్డి తధితరులు

**నాచారం, జులై 8 ప్రభాతవార్త :** మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా నాచారం ఎక్స్‌రోడ్‌లోని ఆయన విగ్రహానికి తెలంగాణ పీసీసీ లేబర్ సెల్ ఉపాధ్యక్షులు, నాచారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి.ఎస్. ప్రకాష్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వి.ఎస్. ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి పేదల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, విద్య, వైద్య రంగాల అభివృద్ధికి విశేష సేవలు అందించి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కృష్ణ రెడ్డి, రామ్ రెడ్డి, రమేష్ గౌడ్, అశ్వత్థామ రెడ్డి, ఎం. శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ యాదవ్, నర్సింగ్ రావు, సునీల్ రెడ్డి, షరఫుద్దీన్, నరేష్, రేవంత్, బాలు యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, షాహిద్, పాషా, కావేరి, అశోక్, తర్రి, రాజశేఖర్, ఉమా, యాసీమ్, అంజుమ్, మమతతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని మహానేతకు ఘన నివాళులర్పించారు.

## ముఖ్యమంత్రిని కలిసిన నెమలి అనిల్ కుమార్


సీఎంకు కృతజ్ఞతలకు తెలుపుతున్న నెమలి అనిల్

**నాచారం, జులై 8 ప్రభాతవార్త :** నాచారంలోని తెలంగాణ ఫుడ్స్‌లో నూతన బాలామృతం ప్లాంట్ ప్రారంభోత్స వ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డిను గ్రేటర్ కాంగ్రెస్ నేత, ఉమ్మడి మల్లాపూర్ డివిజన్ నాయకులు నెమలి అనిల్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలియజేసి, నూతన బాలామృతం ప్లాంట్ ప్రారంభం రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా చిన్నారుల పోషకాహార భద్రతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## పేద ప్రజల ఆశాజ్యోతి వైయస్సార్


వైయస్సార్ విగ్రహ వద్ద నివాళులర్పిస్తున్న గణేష్‌నేత, ఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జులై 8 ప్రభాతవార్త:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్. రాజశేఖర్‌రెడ్డి 77వ జయంతి సందర్భంగా శ్రీరామ కృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక ఉపేందర్‌రెడ్డి అధ్వర్యంలో ఉమ్మడి ఆర్‌కె.పురం డివిజన్ పరిధిలోని చిత్రాలేవుట్ కాలనీలోని వైయస్సార్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పున్న గణేష్‌నేత, చిలక ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల ఆశాజ్యోతి దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావ్, శ్రీప్రసన్నాంజనే యస్వామి దేవాలయం చైర్మన్ తలాటి రమేష్‌నేత, రామకృష్ణగౌడ్, దుబ్బాక శేఖర్, జ్ఞానేశ్వర్‌యాదవ్, పగడాల ఎల్లన్న, కృష్ణారావు, వెంకటేశంగుప్తా, వెంకటరమణారెడ్డి, అల్లేటి కిరణ్‌కుమార్, నభీ, రాజునాయక్, కందుకూరి సుదర్శన్, గునుగంటి రమేష్‌గౌడ్, రఫీ, సమ్మద్, విప్లవరెడ్డి, నరసింహ యాదయ్య, శ్రీనివాస్‌గౌడ్, పాషా, పటేల్ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.


దివంగత ముఖ్యమంత్రి డాక్టర్.వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా వై.ఎస్.ఆర్.సి.పి.రాష్ట్ర నాయకులు, మాజీ బి.సి.కార్పొరేషన్ డైరెక్టర్ పల్లపు రాము బి.ఎన్. రెడ్డి.నగర్ లోని ఆయన కార్యాలయం వద్ద వై.ఎస్.ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మధు,సుందర్,నాగేశ్వరరావు, రాణా, ప్రజ్వల్ తదితరులు పాల్గొన్నారు.

# హయత్‌నగర్ విద్యాశాఖలో అవినీతి దందా..!

## -ప్రైవేటు స్కూళ్ల నుంచి యధేచ్ఛగా వసూళ్లు : పట్టని అధికారులు

**హయత్‌నగర్, జూలై 6 ప్రభాతవార్త :** తెలంగాణలో విద్యా శాఖ ఎన్నో సంస్కరణలు తెచ్చి ఉన్నత ప్రమాణాలతో తీర్చి దిద్దాలని సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేస్తుండగా కొందరు విద్యాశాఖ అధికారుల కారణంగా ఇది నీరుగారి పోతుంది. విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాల్సిన విద్యాశాఖ ఉన్నతాధికారులు కొందరు అవినీతికి పాల్పడుతూ అందినకాడికి దండుకుంటున్నారు. హయత్‌నగర్ మండల పరిధిలో యధేచ్ఛగా సాగుతున్న అవినీతి దందా బాగోతం వివరాలు ఇలా ఉన్నాయి. హయత్‌నగర్ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల, ప్రైవేటు విద్యా సంస్థలు కొనసాగు తున్నాయి. వీటిని మౌళిక వసతులు, విద్యార్థుల సదుపా యాలు చూడాల్సిన విద్యాశాఖ అధికారులు అవినీతికి పాల్పడు తూ నిబంధనలు తుంగలో తొక్కుతున్నారనే విమర్శలు ఉన్నాయి. హయత్‌నగర్ మండల విద్యాశాఖలో పనిచేస్తున్న ఒక అధికారి ప్రైమరీ స్కూల్ నుంచి హైస్కూల్ వరకు రేటు నిర్ణయించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారనే పిర్యాదులు ఉన్నాయి. దీంతో పాటు కొత్త స్కూల్ అనుమతి కావాలంటే రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు ఇవ్వా ల్సిందేనని, లేకుంటే ఫైల్ ముందుకు కదలదని పలువురు బాహటంగా చెప్పుకుంటున్నారు. మండల పరిధిలో ఇప్పటి వరకు సుమారు 150 మంది ప్రైవేటు స్కూళ్లు ఉన్నాయి. వీటితోపాటు కొత్తగా అనేక స్కూళ్లు వస్తున్నాయి. కొత్త పాఠశాల ఏర్పాటు చేయాలంటే రెండు సార్లు విచారణ చేస్తారని, వచ్చిన ప్రతిసారి రూ.50వేల వరకు ఇవ్వా ల్సిందేనని పలువురు పేర్కొంటున్నారు.

**ప్రైవేటు వ్యక్తులతో యధేచ్ఛగా వసూళ్లు :**

హయత్‌నగర్ మండల పరిధిలో కొందరు అధికారులు ప్రైవే టు వ్యక్తులను నియమించుకుని యధేచ్ఛగా వసూళ్లకు పాల్పడుతున్నారనే పిర్యాదులు ఉన్నాయి. ప్రైవేటు పాఠశాలలో పుస్తకాల విక్రయాలు, ఇతర సౌకర్యాలు లేవని చెబుతూ పలువురి నుంచి ముందుగా వీరే ఫిర్యాదులు చేయిస్తారు. అనంతరం అధికారులు నిర్ణయించిన వ్యక్తులు స్కూల్ వద్దకు వెళ్లి డబ్బులు వసూళ్లు చేస్తారని పలువురు ఆరోపిస్తున్నారు. ఎవరైనా ప్రైవేటు పాఠశాలల నిర్వహకులు డబ్బులు ఇవ్వకపోతే వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్ప డుతారని పలువురు పేర్కొంటున్నారు. గత కొద్ది రోజులుగా సాగుతున్న అవినీతి దందాపై పలువురు పాఠశాల నిర్వాహకులు త్వరలోనే ఉన్నతాధికారులకు తగు ఆధారాలతో ఫిర్యాదు చేసేందుకు సిద్ధం అవుతున్నట్లు సమాచారం.

**అవినీతి అధికారులపై ఎసిబి నిఘా..!**

హయత్‌నగర్ విద్యాశాఖలో జరుగుతున్న అవినీతి దందాపై కొందరు ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇప్పటికే దీనిపై రంగంలోకి దిగిన అధికారులు విద్యాశాఖలో జరుగుతున్న తతంగంపై కన్ను వేసినట్లు తెలిసింది. విద్యాశాఖ కార్యాలయంలో స్కూల్ నిర్వహకుల నుంచి డబ్బులు దండుకుంటూ అవినీతికి పాల్పడుతున్న వ్యక్తుల సమాచారం ఇప్పటికే కొందరు నిర్వహకులు అందజేసినట్లు సమాచారం. త్వరలోనే అవినీతికి తిమింగలాలపై వేటు పడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

## హబ్సిగూడ కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు : పరమేశ్వర్‌రెడ్డి


కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కంది శ్రవణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరుతున్న యువకులు

**ఉప్పల్, జూలై 8 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని, పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలు చూసి పార్టీలో చేరేందకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని ఉప్పల్ నియోజకవర్గం అసెంబ్లీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం హబ్సిగూడ డివిజన్ అధ్యక్షుడు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి, అనిల్ మామిడాల ఆద్వర్యంలో పలువురు పార్టీ నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరిన 30 మంది యువకులు. అనంతరం ఎం.పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న, అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై దాదాపు 30 మంది యువకులు బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరినట్లు తెలిపారు.హబ్సిగూడ డివిజన్ అధ్యక్షులు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి సారథ్యంలో పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువకుల చేరికతో పార్టీకి మరింత బలం చేకూరిందన్నారు. రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. అనంతరం హబ్సిగూడ డివిజన్ ప్రెసిడెంట్ కంది శ్రవణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పార్టీలోకి నూతనంగా చేరిన యువకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పని చేసే వారికి రాబోయే కాలంలో సముచిత ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. అనంతరం హబ్సిగూడ స్ట్రీట్ నంబర్ 8లోని లక్ష్మి నగర్ కు చెందిన అనిల్ మామిడాల ఆధ్వర్యంలో 30 మంది యువకులు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరినట్లు తెలిపారు. లక్ష్మీ నగర్, మహేశ్వరి నగర్, శోభన నగర్ లకు చెందిన వెంకట్, చింటూ, రాకేష్, పవన్, కరుణాకర్, క్రాంతి, రాజు, వినోద్, వేణు, అజయ్, నీరజ్, జషు, సాత్విక్, ఆదిత్య, కృష్ణ, సూర్య, చరణ్, మణి, సాయి, ధనుష్, అభినయ్, రాజేష్, వర్షిత్, శివ, అనుదీప్, విక్కీ, రాకేష్, సందీప్, సురేష్, ఎన్ అంజి తదితరులు పార్టీలో చేరారు. ఈ ఈ కార్యక్రమంలో హబ్సిగూడ మాజీ డివిజన్ ప్రెసిడెంట్ గన్నారం విజయ్ కుమార్, జనరల్ సెక్రటరీ ధర్మా నాయక్, సీనియర్ నాయకులు మురళీ కృష్ణ ముదిరాజ్, గుండు రాజన్న, మాలు నాయక్, వాసు నాయక్, సుమన్ నాయక్, శివ, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌లో భాగస్వాములు కావాలి



**ఎల్.బి.నగర్, జులై 8 ప్రభాతవార్త:** ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరు ఎస్ఐఆర్‌లో భాగస్వాములు కావాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిలుకా ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రత్యేక సమగ్ర సంరక్షణ పునశ్చరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు బుధవారం ఎన్యూమరేషన్ పత్రాలను సరూర్ నగర్ సర్కిల్ అధికారులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ అమూల్యమైన ఓటును భద్రపరచుకోవడానికి తప్పనిసరిగా ప్రత్యేక సమగ్ర సంరక్షణ పునశ్చరణ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. అడిషనల్ మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్, బిఎల్ఓ పరమేశ్వరి, ఉదయాని, సంధ్య, నందిని, పుష్పలత సూపర్వైజర్, ప్రభాకర్ ఆధ్వర్యంలో ఓటర్లకు ఎన్యూమరేషన్ పత్రాలను ఓటర్లకు అందజేసినట్లు ఆయన తెలిపారు.

## ఒక సిసి కెమెరా వందమంది పోలీసులతో సమానం : డిసిపి సురేష్


భాస్కర రావు నగర్ లో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఉప్పల్ డిసిపి సురేష్ ఐపిఎస్ కాలనీ అధ్యక్షులు గోవర్ధన్...

**కుషాయిగూడ, జులై 8,ప్రభాతవార్త :** ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానంగా పనిచేస్తుందని ఉప్పల్ డివిజన్ డిసిపి సురేష్ ఐపిఎస్ పేర్కొన్నారు. కంప్రెసర్కిల్ కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని సైనిక్పురి భాస్కరరావు నగర్ కాలనీలో కాలనీ అసోసియేషన్ వారి సౌజన్యంతో సుమారు 6 లక్షల రూపాయలతో నిర్మించుకున్న సీసీ కెమెరాలను నాయనా కుషాయిగూడ ఏసిపి వెంకట్రెడ్డి కాలనీ అధ్యక్షులు ప్రముఖ న్యాయవాది గోవర్ధన్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుషులు స్పష్టమైన సమాచారాన్ని ఇవ్వకపోయినాప్పటికీ కెమెరా మాత్రం అబద్ధం ఆడకుండా స్పష్టమైన సమాచారాన్ని అందించడంతోపాటు ప్రతి దృశ్యాలను కెమెరాలో బంధించి నేరాల నియంత్రణకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. అలాంటి సీసీ కెమెరాలు ప్రతి కాలనీలో ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. సీసీ కెమెరాలు ఏర్పాటుతోపాటు మెయింటెనెన్స్ చేయడం కూడా ఎంతో అవసరం అన్నారు. ఏసీపీ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సీసీ కెమెరా అబద్ధం చెప్పదని స్పష్టమైన సమయాన్ని సమాచారాన్ని అందిస్తుంది అన్నారు. నేరాల నివారణకు సీసీ కెమెరాలు మూలమని వాటి పట్ల అవగాహన కలిగి ప్రతి కాలనీవాసులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కుషాయిగూడ ఎస్ హెచ్ ఓ భాస్కర్ రెడ్డి ప్రోద్బలంతో 35 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి శ్రీకారం చుట్టామని కాలనీ అధ్యక్షులు ప్రముఖ న్యాయవాది గోవర్ధన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ ఎస్హెచ్ఓ ఎల్ భాస్కర్ రెడ్డి క్రైమ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ స్వర్ణరాజ్ శివమణి, సబ్ ఇన్స్పెక్టర్లు సాయిలు వెంకన్న సుధాకర్ రెడ్డి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## సంతోష్‌నగర్ డిపిఎస్ పాఠశాలలో ఘనంగా 'గ్లో పీస్'


'గ్లో పీస్' కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యఅతిథులు

**సైదాబాద్, జులై 8 ప్రభాతవార్త:** సంతోష్‌నగర్ డిపిఎస్ పాఠశాలలో 'గ్లో పీస్' కార్యక్రమాన్ని డైరెక్టర్ పల్లవి మల్హా నేతృత్వంలో కొమురయ్య, యశస్విని, త్రిభువన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బ్రహ్మ కుమారి సమాజం కవిత, బౌద్ధ మత గురువు బిక్కు సంఘ పాలక, మౌళి, జాయెద్, పాస్టర్ జ్ఞాన ప్రకాష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాంతి, కరుణ, సహకారం, సామరస్యం వంటి విలువలు కలిగి ఉండడం గురించి వివరంగా తెలియజేశారు. కార్యక్రమ అనంతరం ప్రపంచ శాంతి, సామరస్యాన్ని పెంపొందించడం కోసం తెలుపు రంగు బెలూన్స్‌ను ఎగురవేశారు. ప్రేమ, దయ, సహనం, పరస్పర గౌరవం వంటి విలువలు ప్రోత్సహించడం కోసం గంటను మ్రోగించారు. గ్లో పీస్ కార్యక్రమ వివరాలు తెలియజేస్తూ విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పాటు ప్రధాని నరేంద్రమోడికి పోస్ట్ కార్డులపై శాంతి సందేశం వ్రాసారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేసిన సామ సుందర్‌రెడ్డి


పుల్లయ్యకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న సామ స్వప్న సుందర్‌రెడ్డి

**సైదాబాద్, జులై 8 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ సింగరేణి కాలనీకి చెందిన పుల్లయ్య గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాడు. పుల్లయ్య ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండడంతో యాకుత్‌పుర నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి సామ సుందరెడ్డిని కలిసి తన పరిస్థితిని వివరించి సిఎం రిలీఫ్ ఫండ్ ఇప్పించాల్సిందిగా కోరాడు. దీంతో వెంటనే స్పందించిన సుందర్‌రెడ్డి, పుల్లయ్య చేత సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించారు. ఈ నేపథ్యంలో సిఎం రిలీఫ్ ఫండ్ నుండి మంజూరైన చెక్కును పర్వతాలుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ వాసులకు ఎల్లవేళలా అందుబాటులోనఉంటూ తమ పూర్తి సహాయ సహకారం అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు మెట్టు భాస్కర్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, శ్రీహరి, ప్రేమ్ కుమార్, లక్ష్మి ఇబ్బు తదితరులు పాల్గొన్నారు.

## తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవం : మండల గిర్దవార్ ప్రేమ్ కుమార్

**హయత్ నగర్, జూలై 8, ప్రభాతవార్త:** తనపై వచ్చిన ఆరోపణ అవాస్తవమని అబ్దుల్లాపూర్మెట్ మండల్ మండల గిర్దవార్ ప్రేమ్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దఅంబర్పేట్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 244 లో గల ప్రభుత్వ భూమిని విష్ణువర్ధన్ రెడ్డి అనే వ్యక్తి దౌర్జన్యంగా, అక్రమంగా కబ్జా చేయడానికి ప్రయత్నించగా, మండల తాహసిల్దార్ ఆదేశాల మేరకు తాను ఆ అక్రమ నిర్మాణాలను కూల్చివేయడం జరిగిందని వివరించారు. అయితే ఈ వాస్తవాన్ని పక్కనపెట్టి, కనీసం నా వివరణ కూడా తీసుకోకుండా కొంతమంది నన్ను భయభ్రాంతులకు గురిచేస్తూ, నాపై పూర్తిగా తప్పుడు, నిరాధారమైన వార్తలను ప్రచురించి నా ప్రతిష్టకు భంగం కలిగించారని బ్లాక్‌మెయిలింగ్, తప్పుడు ప్రచారానికి ప్రతిచర్యగా ఇప్పటికే పోలీస్ స్టేషన్‌లో చట్టపరమైన ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు.

## వైయస్సార్ సేవలు చిరస్మరణీయం


వైయస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న లింగాల కిషోర్‌గౌడ్, వజీర్ ప్రకాష్‌గౌడ్, శశిధర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జులై 8 ప్రభాతవార్త:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ కార్పొరేటర్, టిపిసిసి ప్రచార కమిటీ కోకన్వీనర్ వజీర్ ప్రకాష్‌గౌడ్, కొత్తపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగాల కిషోర్‌గౌడ్, చైతన్యపురి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే.శశిధర్‌రెడ్డి, పేర్కొన్నారు. యువజన కాంగ్రెస్ ఎల్బీనగర్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి జావేద్ ఆధ్వర్యంలో బుధవారం కొత్తపేట చౌరస్తా వద్ద నిర్వహించిన వైయస్.రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకురాలు రజిని, మల్లీశ్వరి, షేక్ షరీఫ్, బి.వెంకటేశయాదవ్, వెంకటేష్‌చారి, కృష్ణారెడ్డి, జహంగీర్ బాబా గౌడ్, కొమ్ము యాదగిరి, అబ్దుల్ కరీం, యూత్ కాంగ్రెస్ ఎల్బీనగర్ వైస్ ప్రెసిడెంట్ సాయిరాం పాల్గొన్నారు.

## పూర్తి స్థాయి కమిటీల ఏర్పాటుకు చర్యలు


ఉప్పల్ అసెంబ్లీ కాంగ్రెస్ డివిజన్ కమిటిల ఏర్పాటుపై జరిగిన సమావేశంలో పాల్గొన్న ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, జూలై 8 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గం పరిధిలో వివిధ డివిజన్ అనుబంధ కమిటిల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకుంటున్నామని పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం కాంగ్రెస్ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి నూతనంగా ఎన్నికైన డివిజన్ అధ్యక్షులు,మాజీ అధ్యక్షులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి బూత్‌లో సర్ కార్యక్రమం బలోపేతానికి బిఎల్ఏలతో పాటు నియోజకవర్గ కోఆర్డినేటర్లు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. ఎన్నికల్లో ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని, ప్రతి ఒక్కరికి ఓటు ఉండాలని సూచించారు. పార్టీ డివిజన్ పూర్తి స్థాయి కమిటిలను నియమిస్తామని తెలిపారు. ఉప్పల్ సర్కిల్‌లోని ప్రతి డివిజన్‌లకు కమిటిలు ఎన్నుకుంటామని తెలిపారు. ప్రతి డివిజన్ కార్యవర్గం, బిసి, సెల్, ఎస్సీ సెల్, మైనారిటీ సెల్, మహిళా కాంగ్రెస్ కమిటీల ఏర్పాటుపై చర్చించినట్లు తెలిపారు. టిపిసిసి చీఫ్ మహేష్ గౌడ్, సిఎం రేవంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ ఆదేశాల మేరకు ఉప్పల్ పరిధిలోని అన్ని డివిజన్లలో వెంటనే కమిటీల ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఆకిటి ఆగంరెడ్డి, ఈగ అంజయ్య, నల్లవెల్లి మహేందర్, సందీప్, కంది శ్రవణ్‌కుమార్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేతలు ఆకారపు అరుణ్, ఎం.డి.రఫీక్, ములకలపల్లి రాజేష్, విజయ్‌కుమార్, నామ్ రాజిరెడ్డి,పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## అల్మాస్‌గూడలో ఘనంగా వైఎస్ఆర్ జయంతి


కేకు కట్ చేసి పంపిణీ చేస్తున్న బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి

**సరూర్‌నగర్, జూలై 8 ప్రభాతవార్త:** ఉమ్మడి రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని బడంగ్‌పేట్ సర్కిల్‌లోని అల్మాస్‌గూడలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్ఆర్ పార్కు వద్ద రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ఏఐసిసి విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేకు కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు, స్థానికులకు పంపిపెట్టారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ నాయకులు నవారు మల్లారెడ్డి, ఎదుళ్ళ ప్రతాప్‌రెడ్డి, బోయపల్లి వెంకట్‌రెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్, వినోద్ నాయక్ పాల్గొన్నారు.


మాతృ వియోగంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు బసిగూడెం బల్వంత్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డిలను ధాతునగర్‌లో పరామర్శిస్తున్న బడంగ్‌పేట్ మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

## 16నుంచి రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలు : కరెడ్ల శ్రీనివాసరావు

**మలక్ పేట, జూలై 8, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో యొనెక్స్ సన్రైజ్ తెలంగాణ రాష్ట్ర 12వ సబ్ జూనియర్ (అండర్ 15) రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ 2026 పోటీలు ఈ నెల 16వ తేదీ నుంచి 19 తేదీ వరకు మణికొండ అల్కాపూర్ టౌన్షిప్‌లోని మ్యాచ్ పాయింట్ ఫ్రైడ్ లో నిర్వహించనున్నట్లు రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ ప్రధాన కార్యదర్శి కరెడ్ల శ్రీనివాసరావు తెలిపారు. ముసారాంబాగ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఈనెల 15వ తేదీలోగా వారి పేర్లను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. బ్యాడ్మింటన్ తెలంగాణ. కామ్ వెబ్సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, స్పాట్ ఎంట్రీలు స్వీకరించబడవని తెలిపారు. క్వాలిఫైయింగ్ మ్యాచులు ఈనెల 16వ తేదీ నుంచి నిర్వహించబడుతాయని, మెయిన్ డ్రా మ్యాచ్‌లు 17వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. క్వాలిఫైయింగ్, మెయిన్ డ్రా మ్యాచ్ లు 15 పాయింట్లు, మూడు గేమ్లలో బెస్ట్ ఆఫ్ త్రీ విధానంలో జరుగుతాయని, అవసరమైతే 21 పాయింట్ల వరకు పొడిగించబడుతాయని వివరించారు. క్రీడాకారులు మ్యాచ్ కు 30 నిమిషాల ముందు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. ఈవెంట్లో విన్నర్, రన్నర్, 3వ, 4వ స్థానాలలో నిలిచిన వారికి మెరిట్ సర్టిఫికెట్లు అందజేయబడుతాయని పేర్కొన్నారు. విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం 19వ తేదీన మ్యాచ్ ముగిసిన తర్వాత నిర్వహించబడుతాయని తెలిపారు. ఈ సమావేశంలో టోర్నమెంట్ నిర్వాహక కమిటీ అధ్య క్షుడు సామా ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు చిప్ప ప్రభాకర్, కార్యదర్శి పోకూరి ఆనంద్ బాబు, కోచ్ ఎం. వే ణు, సమన్వయ కమిటీ సభ్యులు బి. సాయి రెడ్డి, డి. రఘురాం, ఎం. శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

## ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధికి సిఎం రేవంత్‌రెడ్డి హామీ


సిఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే

**ఉప్పల్, జూలై 8 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఇస్తామని సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మంగళ వారం తెలంగాణ ఫుడ్స్ కంపెనీలో బాలామృతం ప్లాంట్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన సిఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పలు అభివృద్ధి పనులపై వినతి పత్రం అంజేశారు.ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పలు అంశాలను సిఎం దృష్టికి తీసుకుని వచ్చారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో అనువైన ప్రాంతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం ప్రభుత్వ భూమిని కేటాయించా లని కోరారు. రామంతాపూర్ డివిజన్‌లో ప్రజలకు మెరుగైన భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం నూతన పోలీస్ స్టేషన్ మంజూరు చేయాలని విన్నవించారు. కోరారు. నాచారం పటేల్ కుంట చెరువు, రామంతాపూర్ చిన్న చెరువు అభివృద్ధి, చెరువుల్లో పేరుకుపోయిన సిల్ట్ తొలగింపు, దోమల సమస్య నివారణ, వాకింగ్ ట్రాక్‌లు మరియు ఓపెన్ స్టేజ్‌ల నిర్మాణం చేపట్టాలని కోరారు.నాచారం టీఎస్ ఫుడ్స్ ఎదురుగా సుమారు 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని విన్నవించారు. ఉప్పల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజల విద్య, భద్రత, గృహ వసతి, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ఈ ప్రతిపాదనలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపించారని తెలిపారు.

## హెల్ప్ డెస్క్‌లను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలి : డిసి సమ్మయ్య



**సరూర్‌నగర్, జూలై 8 ప్రభాతవార్త:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) సందర్భంగా బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలో 51 హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ కమీషనర్ వి.సమ్మయ్య తెలిపారు. బుధవారం ఆయన వివిధ ప్రాంతాల్లోని హెల్ప్ డెస్క్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారాలను పూరించడంలో సహాయం అందించేందుకే హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశామని వెల్లడించారు. సర్కిల్ పరిధిలోని 6 డివిజన్లలో 138 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఓటర్ల కోసం నిర్దేశిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 51 హెల్ప్ డెస్క్‌ల ద్వారా సేవలు అందిస్తున్నట్లు ఆయన వివరించారు. హెల్ప్ డెస్క్ కేంద్రాల వద్దకు వచ్చే వారికి ఎన్యూమరేషన్ పూరణలో వచ్చే సందేహాలను నివృత్తి చేసి వారికి సాయం చేయాలని ఆయన సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. సర్కిల్ పరిధిలో ఎన్యూమరేషన్ ప్రక్రియ పారదర్శకంగా వేగవంతంగా చేస్తూ ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన సూచించారు. ఓటర్లు హెల్ప్ డెస్క్‌లను సద్వినియోగం చేసుకొని ఎన్యూమరేషన్ ఫారాలను సక్రమంగా పూరించి బిఎల్ఓలకు అందజేయాలని డిసి కోరారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



**తుర్కయంజాల్, జూలై 8, ప్రభాతవార్త:** ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేద కుటుంబాలకు వైద్య చికిత్సల కోసం తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి నిజమైన వరంగా నిలుస్తోందని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్ అన్నారు. తుర్కయంజాల్ డివిజన్ అధ్యక్షుడు ఓర్సు శ్రీనివాస్, తొర్రూర్ డివిజన్ అధ్యక్షుడు కోసికే ఐలయ్య ఆధ్వర్యంలో మన్నెగూడ ఎన్ఎస్ఆర్ నగర్, రోడ్ నెం.1లోని చలసాని కళ్యాణ మండపంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, తుర్కయంజాల్, కమ్మగూడ, మన్నెగూడ తదితర కాలనీలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు.వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి సహకారంతో ప్రజలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అందుతున్నాయని పేర్కొన్నారు.ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలిచి వారి ప్రాణాలను కాపాడేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సామ భీమ్ రెడ్డి, మర్రి మహేందర్‌రెడ్డి, మేతరి దర్శన్, రాజు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.